మంత్రి లోకేష్ పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో ప్రజలు నేతలను కుటుంబ సభ్యుల్లా ఆహ్వానించటం, లోకేష్ నాయకత్వం పట్ల గాఢమైన నమ్మకాన్ని చాటుతోంది. ఇది ప్రజల మనసులో ఏర్పడిన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది.



**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

శుక్రవారం 11.07.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 94 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


### పండుగ వాతావరణంలో ..

## ఆత్మీయ సమావేశం

- ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్న మంత్రి లోకేష్
- చంద్రబాబు పాదాలకు నమస్కరించిన లోకేష్
- చంద్రబాబుతో కలిసి విద్యార్థులతో ఇష్టాగోష్టి



కొత్తచెరువు( జర్నలిస్ట్ ఫైల్ ): శ్రీ సత్యసాయి జిల్లా జడ్పీ పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం మెగా పీటీఎం 2.0 కార్యక్రమం ఆద్యంతం పండుగ వాతావరణంలో కొనసాగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ముందుగా జూనియర్ కళాశాల ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాదాలకు మంత్రి నారా లోకేష్ నమస్కరించారు. అనంతరం తన నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం కింద సాయం పొందిన పి.మాధవి, ఆమె నలుగురు పిల్లలు ముఖ్యమంత్రి పాదాలకు నమస్కారం చేసి ఆశీర్వాదం పొందారు. అనంతరం తల్లుల గొప్పదనంతో పాటు తల్లికి వందనం పథకం గురించి తెలియజేసేలా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వాల్స్ ను ముఖ్యమంత్రితో కలిసి వీక్షించారు. ఫోటోలు దిగారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్స్ గౌరవ వందనం మధ్య జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. మిగతా 2లో...

## మా కుమారుల్ని రక్షించండి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి మహిళ వినతి
- సమస్యను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లిన పవన్ కళ్యాణ్

విజయనగరం ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలంటూ గండబోయిన సూర్యకుమారి అనే మహిళ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్‌ని సూర్యకుమారి కలిసి వినతిపత్రం సమర్పించారు. మిగతా 2లో...

# గురువులదే కీలక బాధ్యత

- విద్యాశాఖలో ఏడాదిలో తెచ్చిన మార్పులు భేష్
- ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులు
- 2 కోట్ల మందితో పేరెంట్ టీచర్ మీటింగ్ గొప్ప ముందడుగు
- పిల్లలందరినీ చదివించాలనే తల్లికి వందనం
- తల్లి పేరిట ఒక మొక్క నాటేలా విద్యార్థులకు మొక్కలు
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సీఎం, మంత్రి లోకేష్



సత్యసాయి జిల్లా, పుట్టపర్తి, ( జర్నలిస్ట్ ఫైల్ ) : విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో గురువులదే కీలక బాధ్యతని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం, కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు సీఎం ముఖ్య అతిధిగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లితండ్రులు–ఉపాధ్యాయులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముందు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. కేంబ్రిడ్జి, స్టాన్ ఫర్డ్‌లో చదువుకుని రాజకీయాల్లోకి వచ్చిన నారా లోకేష్ ఇప్పుడు విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చూస్తున్నారని సీఎం అన్నారు. ఆధునిక దేవాలయాలైన పాఠశాలలను పరిరక్షించుకునే బాధ్యత మన అందరిదీ అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రెండో సారి విద్యార్థుల తల్లితండ్రులు–ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించిన విద్యాశాఖ మంత్రి లోకేష్ ను అభినందిస్తున్నానని అన్నారు. గురు పౌర్ణమి రోజునే రాష్ట్రవ్యాప్తంగా 61 వేల పాఠశాలల్లో 2.28 కోట్ల మందితో ఈ సమావేశం నిర్వహించడం సంతోషాన్ని కలిగిస్తోందని.. ఇది గిన్నీస్ రికార్డుల్లోకి ఎక్కుతుందన్నారు. మంత్రి లోకేష్ విద్యార్థిగా ఉన్న సమయంలో తాను కూడా పాఠశాల నిర్వహించే పేరెంట్స్ మీటింగ్ కు వెళ్లలేక పోయానని అన్నారు. తన సతీమణి భువనేశ్వరి ఏ సమావేశాన్ని విడవకుండా వెళ్లి లోకేష్ ను కేంబ్రిడ్జిలో చదివించేంత వరకూ శ్రద్ధ పెట్టారన్నారు. తల్లి తండ్రులు కూడా తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించి వారి కెరీర్ ను తీర్చిదిద్దటంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళల ఆర్థిక సామాజిక వికాసానికి పని చేసే ప్రభుత్వంగా గతంలో డ్వాక్రా సంఘాలనే బలమైన పొదుపు వ్యవస్థను రూపకల్పన చేసి వారి అభివృద్ధికి తోడ్పాడ్డామని అన్నారు. ఇప్పుడు ప్రతీ కుటుంబంలోని పిల్లలందరినీ చదివించాలనే లక్ష్యంతో తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా వారందరికీ ఈ పథకాన్ని వర్తింప చేసి ఆ కుటుంబాల్లో వెలుగులు తీసుకువచ్చామని అన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత లోకేష్ దే**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరి భవిష్యత్తునూ తీర్చిదిద్దే విద్యాశాఖ బాధ్యతను మంత్రి లోకేష్ ఏరికోరి తీసుకున్నారని సీఎం అన్నారు.

● వివరాలు 2 లో

# లోకేష్ పాలనపై ప్రజల్లో అమోఘ స్పందన



- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం
- తెనాలిలో జోరుగా, హుషారుగా కొనసాగుతున్న సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎనిమిదో రోజు పర్యటనకు ప్రజాదరణ

తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): సుపరిపాలనకు నూతన అధ్యాయంగా, ప్రజలతో నేరుగా మమేకమయ్యే వినూత్న ప్రయోగంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలిలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించింది. ఎనిమిదో రోజు కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పర్యటన ప్రజల్లో విశేష స్పందనను రేపుతోంది. ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి, సమస్యలు తెలుసుకుని, సంక్షేమ పథకాలు చేరుతున్నాయా అన్న విషయంపై సమీక్షించడమే కాక, చంద్రబాబు,లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ సంకల్ప బలాన్ని ప్రజల మన్ననతో మరోసారి నిరూపించారు. ప్రజల ఆదరణ మధ్య ఆలపాటి పర్యటన ఒక ప్రజా యాత్రగా మారింది.

2 లో



## రైతులే దేశానికి బలం



- మహిళలు పేదరికం నుంచి తలెత్తి నిలవాలి
- 53,746 ఎస్ హెచ్ జి సభ్యులకు రూ.437 కోట్ల బ్యాంకు లింకేజ్ పంపిణీ
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

పుట్టపర్తి, ( జర్నలిస్ట్ ఫైల్ ) : రైతులే దేశానికి బలమని.. మహిళలు పేదరికం నుంచి తలెత్తి నిలవాలని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. గురువారం పుట్టపర్తి మండలం, పెడబల్లి గ్రామ పొలాల్లో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో జరిగిన ముఖాముఖి సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పాల్గొన్నారు. మిగతా 2లో...

## రాష్ట్రంలో ప్రగతి యజ్ఞం



- పెట్టుబడులకు అనువైదిగా రాష్ట్రానికి దక్కిన కితాబే నిదర్శనం
- రప్పా...రప్పారెడ్డి కనుసన్నలలో హింసాత్మక యాగం
- విజ్ఞులైన రాష్ట్ర ప్రజలు ఈ వైరుధ్యాన్ని గమంచాలి
- అధిక జనాభా అవరోధం కాదన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మిగతా 2లో...

## అందుకే నిన్ను ప్రజలు తొక్కేశారు



పెనుకొండ ( జర్నలిస్ట్ ఫైల్ ) : జగన్ రెడ్డికి కారు కింద కార్యకర్తలను, రైతు పండించిన పంటను తొక్కించడం అలవాటైందని, అందుకే ఆయనను ప్రజలు తొక్కేశారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఫైరయ్యారు. తన ఉనికి కోసం చిల్లర రాజకీయాలకు, శవ రాజకీయాలకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. పెనుకొండ పట్టణంలో తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత గురువారం మాట్లాడారు. జగన్‌కు బాబాయ్ గొడ్డలిపోటు, కోడికత్తి, గులక రాయి వంటి డ్రామాలు ఆడడం అలవాటుగా మారిందని, దీనిలో భాంగా చిత్తూరులోని బంగారుపాళ్యంలో మామిడి రైతుల పరామర్శ పేరుతో జగన్నాటకమే ఆడాడదని విమర్శించారు. మామిడి రైతులకు జగన్ పరామర్శలో ఒక్క రైతు కూడా లేదని, అందరూ వైసీపీ కార్యకర్తలే, మిగతా 2లో...




### పండుగ వాతావరణంలో ..

# ఆత్మీయ సమావేశం



(మొదటి పేజీ తరువాయి)

అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా వారికి ఘనస్వాగతం పలికారు.

**చంద్రబాబు గారితో కలిసి విద్యార్థులతో ఇష్టాగోష్టి :** ముందుగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పదో తరగతి విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రగతి, అభిరుచి, ప్రవర్తన, ఆరోగ్యం హాజరు మొదలైన అంశాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకే కుటుంబానికి చెందిన పదో తరగతి ఏ సెక్షన్ కు చెందిన పి.రిహాన్ బాష, పి.జిగ్ను ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. వారి మార్కులను అడిగి తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఇంకా బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. స్కూల్ కు గైర్హాజరైన విద్యార్థులకు సంబంధించి తల్లిదండ్రులకు ఆగష్టు నుంచి మెసేజ్ రూపంలో తెలియజేయజేస్తామని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ తెలిపారు.

**ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు చెప్పిన చంద్రబాబు, విద్యార్థిగా మారి శ్రద్ధగా విన్న మంత్రి లోకేష్**

పదో తరగతి విద్యార్థులతో ఇష్టాగోష్టి అనంతరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి బి సెక్షన్ కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపాధ్యాయుడుగా మారి విద్యార్థులకు 'వనరులు' అనే సబ్జెక్ట్ పై క్లాస్ చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిగా మారిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.. ముందు బెంచీలో కూర్చొని చంద్రబాబునాయుడు గారు చెప్పిన పాఠాన్ని శ్రద్ధగా విన్నారు. మానవ వనరులు అంటే ఏమిటి, సహజ వనరులు, పునరుత్పాదక వనరులు, పునరుత్పాదకం కాని వనరులపై విద్యార్థులకు ముఖ్యమంత్రి పాఠం బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. సమాజంలో మార్పు తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు.

**మంత్రి లోకేష్ ను ప్రశంసించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

భవిష్యత్ లో విద్యార్థులు ఏం కావాలనుకుంటున్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అడిగి తెలుసుకున్నారు. పోలీస్, డాక్టర్, ఐఏఎస్, క్రికెట్ ప్లేయర్లు కావాలనుకునేవారు చేతులు పైకి ఎత్తాలని సూచించారు. వారంతా తమ లక్ష్యాన్ని చేతులు పైకి ఎత్తి చెప్పారు. విద్యార్థులకు ఆశయం ఉండాలని.. ఆశయ సాధన కోసం ఇప్పటినుంచే కష్టపడి చదవాలని మార్గదర్శకం చేశారు. అందరికీ గుడ్ లక్.. ఆల్ ది బెస్ట్ చెప్పారు. రాజకీయ నాయకులు కావాలనుకునేవారు చేతులు ఎత్తాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ అడగగా.. ఎవరూ చేయి పైకి ఎత్తలేదంటూ నవ్వులు పూయించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. నారా లోకేష్ బాగా చదువుకున్నారు, మంత్రి అయ్యారు, తల్లికి వందనం అమలు చేశారా, లేదా.. పాఠశాలల్లో మార్పులు తీసుకువచ్చారంటూ ఆయనను ప్రశంసించారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలించారు. మార్కులపై ఆరా తీశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఫోటోలు దిగారు.

# మా కుమారుల్ని రక్షించండి

(మొదటి పేజీ తరువాయి)

విజయనగరానికి చెందిన ఆమె– మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్న తమ వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, వారిని విడిపించేందుకు సాయం చేయాలని వేడుకున్నారు. బుధవారం పవన్ కళ్యాణ్‌ని కలసి.. తమ ఇద్దరు కుమారులతోపాటు 8 మంది మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో ఉన్నట్టు వివరించారు. దీనిపై స్పందించిన పవన్ కళ్యాణ్ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న వారిని రక్షించాలని కోరారు. ఈ వ్యవహారంపై విదేశీ వ్యవహారాల శాఖ సానుకూలంగా స్పందించింది. విదేశాల్లో మగ్గుతున్న వారిని వెనక్కి తీసుకురావడానికి తగిన హామీ ఇచ్చారు.

# అందుకే నిన్ను ప్రజలు తొక్కేశారు



(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ గుండాలే ఉన్నారని అన్నారు. వైసీపీ నాయకుల నుంచి మామిడి పంటను తీసుకొచ్చి రోడ్డుపై వేసి ట్రాక్టర్లతో తొక్కించారన్నారు. కారు కింద కార్యకర్తలను, రైతు పండించిన పంటను తొక్కాడం జగన్ అలవాటైందన్నారు. అందుకే ప్రజలు కూడా ఆయనను తొక్కేశారని అన్నారు.

**చంద్రబాబుతోనే రైతుకు భరోసా :** తోతాపురి మామిడి ధర పడిపోయినా ఏనాడూ జగన్ పట్టించుకోలేదని మంత్రి సవిత తెలిపారు. తోతాపురి మామిడికి మద్దతుకు అదనంగా రూ.4ల చొప్పున సీఎం చంద్రబాబు రూ.260 కోట్లు విడుదల చేశారన్నారు. ధాన్యం కొనుగోలు చెల్లింపులకు నిధులు మంజూరు చేశారన్నారు. సీఎం చంద్రబాబు... వ్యవసాయానికి, రైతుకు అండగా ఉంటున్నారన్నారు. 5 ఏళ్ల పాలనలో వ్యవసాయాన్ని, రైతులను జగన్ గాలికొదిలేశాడన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ను జగన్ నిర్వీరం చేస్తే.. సీఎం చంద్రబాబు పునరుద్ధరించారన్నారు. రైతుల పట్ల జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నాడని, ఆయనను రైతులు, ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మంత్రి సవిత తెలిపారు.

**ఖబడ్దార్ జగన్...:** తల్లిని, చెల్లిని గౌరవించని వ్యక్తి జగన్ అని, ఆయన రాష్ట్రంలో ఇతర మహిళలను ఏం గౌరవిస్తాడని మంత్రి సవిత తెలిపారు. వైసీపీ నాయకులు, జగన్ మహిళలను కించపరుచుతున్నారన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని వైసీపీ నాయకుడు ప్రసన్నకుమార్ రెడ్డి సభ్య సమాజం సిగ్గుపడేలా అనుచిత వ్యాఖ్యలు చేశాడన్నారు. 'ఖబడ్దార్ జగన్... ఇప్పటికైనా మహిళల పట్ల తీరు మార్చుకోపోతే నువ్వు, వైసీపీ నాయకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని మంత్రి సవిత హెచ్చరించారు.

# లోకేష్ పాలనపై ప్రజల్లో అమోఘ స్పందన







**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** సుపరిపాలనకు సంకేతంగా నిలుస్తున్నకూటమి ప్రభుత్వం, ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచే లక్ష్యంతో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెనాలి పట్టణంలోని 12వ మరియు 13వ వార్డుల్లో పర్యటించారు. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రజలతో మమేకమవుతూ చేపట్టిన ఈ పర్యటనలో భాగంగా, ఆయనకు అన్ని వర్గాల నుంచి ఘన స్వాగతం లభించింది. పూలబొకేలు, కర్పూరహారతులతో పలుచోట్ల ఆత్మీయతను చాటారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, "ప్రజల ఇంటికొచ్చే ప్రతి నాయకుడు, వారు చెప్పే ప్రతి సమస్యను మనస్ఫూర్తిగా గ్రహించాలి. ఈ 'తొలి అడుగు' మా పాలనకు ప్రజల సాక్షిగా ఒక విశ్వాస యాత్ర" అని పేర్కొన్నారు. రామలింగేశ్వరపేట పాత డిపో సెంటర్ నుండి ప్రారంభమైన పర్యటన చినరావూరు, జంపని డొంక రోడ్డు ప్రాంతాల వరకు కొనసాగింది. ఆయా ప్రాంతాల్లోని మహిళలతో, వృద్ధులతో, యువతతో మాట్లాడి పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా తల్లికి వందనం పథకం, ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ, పింఛన్ల పంపిణీ, తదితర పథకాలు అందుతున్నాయా? అనే విషయాన్ని స్వయంగా అడిగి తెలుసుకోవడం విశేషం.

ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టంగా చెప్పారు. గత ప్రభుత్వం సమయంలో టిడ్కో ఇళ్ల విషయంలో జరిగిన మోసాన్ని గుర్తు చేస్తూ, "పట్టాలు ఇచ్చి మభ్యపెట్టిన వారిని మరిచిపోలేం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అందరూ ఆశించేదే కాదు, నమ్మదగిన పాలనతో ప్రతి ఒక్కరికి సొంతిల్లు కలిగేలా పనిచేస్తోంది" అని వివరించారు.

మంత్రి నారా లోకేష్ నాయకత్వాన్ని ఈ సందర్భంగా పొగిడిన ఆలపాటి, "ఐటీ రంగం ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా లోకేష్ పనిచేస్తుండగా, గంజాయి నిర్మూలనపై కూడా ఆయన కీలక భూమిక పోషిస్తున్నారు. అయినా సరే, తెనాలి నియోజకవర్గంపై ఆయన చూపే శ్రద్ధ అమోఘం. ప్రతి సమస్యపై సమీక్షలు నిర్వహిస్తూ, అభివృద్ధి పథాన్ని నిరంతరం పరిశీలిస్తున్నారు" అని అభినందనలు తెలిపారు. అలాగే, రాబోయే ఆగస్టు 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలవుతుందని ప్రకటించారు.

ప్రజల విశ్వాసమే తమ బలమని, వారి మద్దతే ప్రభుత్వానికి మార్గదర్శకమని ఎమ్మెల్సీ తెలిపారు. "ప్రతి ఇంట్లోకి వెళ్లినప్పుడూ, ప్రజలు తమ ఇంటికొచ్చిన అతిథిలా కాకుండా, కుటుంబ సభ్యుడిగా స్వాగతించారు. ఇది మా పాలనపై వారికి ఉన్న గాఢమైన నమ్మకానికి నిదర్శనం" అన్నారు. ప్రజల్లో పెరుగుతున్న రాజకీయ చైతన్యం, కూటమి విధానాలపై ఉన్న స్పష్టత కనిపించాయని వ్యాఖ్యానించారు.

# రైతులే దేశానికి బలం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..రైతులే దేశానికి బలం అని నలుమూలలకూ ఆహారం అందించే బంధంలాంటి రైతు సమాజం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. భారతదేశ అభివృద్ధిలో రైతుల పాత్ర అత్యంత కీలకమని గుర్తుచేశారు. ఇక్కడ జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సూచించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. "ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు తక్కువ, లాభం ఎక్కువ. ఇది దేశానికి ఆదర్శంగా మారుతుంది" అని మంత్రి గారు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి, తక్కువ భూమిలోనూ అధిక లాభాన్ని సాధించవచ్చని, దీనివల్ల చిన్న రైతులకు అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల సాధికారతపై మాట్లాడుతూ, మన సోదరీమణులు ఇప్పుడు స్వయం సమర్థులవుతున్నారు. ఎవరి మీదా ఆధారపడకుండా, గౌరవంగా జీవించేందుకు ముందడుగు వేస్తున్నారు. పేదరికం నుంచి బయటపడుతూ, సమాజంలో తలెత్తి నిలవాలన్న సంకల్పంతో పని చేస్తున్నారు. ఇది ఎంతో అభినందనీయం అని తెలిపారు. తాను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన "లాడ్లీ బహనా యోజన"ను గుర్తు చేస్తూ, మహిళల సాధికారతకు నేను ప్రాధాన్యం ఇస్తాను. రైతుల సేవ చేయడం అంటే నాకు భగవంతుని సేవ లాంటిది అని మంత్రి అన్నారు.

ఈ సందర్భంగా పుట్టపర్తి, అనంతపురం.. ఉమ్మడి జిల్లాలకు చెందిన 53,746 ఎస్ హెచ్ జి సభ్యులకు రూ.437.09 కోట్ల బ్యాంకు లింకేజ్ చెక్కును అందించారు. అంతకు ముందు పెదబల్లి గ్రామంలో సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన మిశ్రమ పంటను పరిశీలించారు. అలాగే వర్షాభావం వల్ల ఎండిన పంటలపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు. ముందుగా ఎస్ హెచ్ జి మహిళల ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్ కుమార్, భారత ప్రభుత్వ రైతుల సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పేర్ని దేవి, రాష్ట్ర సెర్ప్ సీ.ఈ.ఓ వి.కరుణ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు అగ్రికల్చర్, మార్కెటింగ్, సహకార సంస్థ చైర్మన్ టి. విజయ్ కుమార్,

డిఆర్డీఏ పీడి నర్సయ్య, రైతులు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గురువులదే కీలక బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

స్టాన్ ఫర్డ్, కేంబ్రిడ్జి లాంటి విద్యా సంస్థల్లో చదువుకున్న ఆయన రాష్ట్రంలోని విద్యార్థులకూ మంచి నాణ్యమైన విద్యను అందిస్తారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ "గతేడాది మొదటి విడత పేరెంట్ టీచర్ మీటింగ్ ను 44 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించాం. ఈసారి ప్రైవేటు స్కూళ్లలో సైతం మీటింగ్ ల జరిపేలా చూశామని సీఎం అన్నారు. నెల్లూరులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో సీట్లు ఖాళీ లేవని నో వేకెన్సీ బోర్డు పెట్టారంటే విద్యా నాణ్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు అత్యుత్తమ నైపుణ్యం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0కు 2.28 కోట్ల మంది హాజరయ్యారు. గిన్నీస్ రికార్డు సాధించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం. తల్లి పేరిట ప్రతీ విద్యార్థి ఒక మొక్క నాటేలా చర్యలు తీసుకున్నాం. మొక్కను సంరక్షిస్తూ పురోగతి నమోదు చేసేలా గ్రీన్ పాస్ పోర్టు కూడా ఇచ్చాం. విద్యార్థుల హాజరు, మార్కులు, ప్రవర్తన ఇలా అన్ని అంశాలను లీప్ యాప్ ద్వారా అందిస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం, బూట్లు, బెల్టు, బ్యాగ్ లు ఇచ్చాం. విద్యార్థులకు ఇచ్చిన కిట్లపై ఎలాంటి రాజకీయ నేతల ఫోటోలు పెట్టలేదు. విద్యార్థి కిట్ల కోసం రూ. 980 కోట్లు వ్యయం చేశాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నాం." అని అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసి వారిని ప్రోత్సహించేలా షైనింగ్ స్టార్స్ పేరిట అవార్డులు ఇస్తున్నామని.. ఈ విద్యార్థులకు నచ్చిన కళాశాలల్లో చదువుకునేలా ప్రణాళిక చేస్తామని సీఎం స్పష్టం చేశారు. రాబోయే కాలంలో భవిష్యత్ అంతా నాలెడ్జి ఎకానమీదేనని దానిని అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అన్నారు.

**డీఎస్సీలతో ఉపాధ్యాయుల నియామక ఘనత మాదే**

కూటమి అధికారంలోకి వస్తూనే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేశామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆగస్టులోగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారంతా శిక్షణ తీసుకుని పాఠశాలలకు వస్తారని సీఎం వివరించారు. గతంలోనూ 12సార్లు డీఎస్సీలు వేసి 1.66 లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత తమదేనని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని అన్నారు. గత ఐదేళ్లలో టోఫెల్, ఐబీ సిలబస్ పేరిట గందరగోళపరిచారని ఏ ఒక్కటీ అమలు చేయలేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలను కూడా పారదర్శకంగా నిర్వహించామని అన్నారు. విద్యాశాఖలో అమలు చేస్తున్న సంస్కరణలతో పాటు వ్యవస్థను మెరుగు పర్చేందుకు తల్లితండ్రులు, ఉపాధ్యాయుల అందరి నుంచి సూచనలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో విశాఖ ఏజెన్సీలో పెద్ద ఎత్తున గంజాయి పండించారని.. డ్రగ్స్ కు కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చారని సీఎం అన్నారు. రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపామని అన్నారు. గంజాయి పండించినా, విక్రయించినా అదే వారికి చివరి రోజు అవుతుందని సీఎం హెచ్చరించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం ద్వారా ఈ మహమ్మారిని నియంత్రించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. మత్తుపదార్థాలు విక్రయించే వారి ఆస్తుల స్వాధీనంతో పాటు ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు రాకుండా కట్టడి చేస్తామని అన్నారు.

**వనరుల సద్వినియోగంపై విద్యార్థులకు పాఠం**

విద్యార్థుల తల్లితండ్రులు– ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం 2.0లో భాగంగా విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో కలిసి కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు– వారి తల్లి తండ్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. తొలుత పాఠశాల ఆవరణలో విద్యార్థులు చిత్రించిన తల్లికి వందనం పోస్టర్లు, కళారూపాలను సీఎం తిలకించారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లోగోతో రూపొందించిన ఫొటో ఫ్రేమ్ లో సీఎం మంత్రి లోకేష్, ఎన్సీసీ కేడెట్లతో కలిసి ఫోటో దిగారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లితండ్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ముచ్చటించారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చిన సీఎం, మార్కులు పెంచుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థులు హాజరు, మార్కుల వివరాలను స్వయంగా తల్లితండ్రులకు వివరించి కౌన్సిలింగ్ చేశారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల వివరాలను తెలియచేసేలా సమాచారం పంపుతున్నామని విద్యాశాఖ మంత్రి లోకేష్ సీఎంకు వివరించారు. విద్యార్థులను పాఠశాలకు నిరంతరం పంపేలా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

అనంతరం పాఠశాలలోని తరగతి విద్యార్థులకు చెందిన తరగతి గదిని పరిశీలించి వారితో మాట్లాడిన ముఖ్యమంత్రి.. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి వారిలో స్ఫూర్తిని నింపేలా దిశానిర్దేశం చేశారు. తర్వాత పాఠశాలలోని 8 తరగతి గదిలోకి వెళ్లిన సీఎం కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠం చెప్పారు. సోషల్ సైన్స్ లోని వనరులు అనే పాఠాన్ని విద్యార్థులకు బోధించారు. మరోవైపు విద్యార్థులతో కలిసి బెంచిపై కూర్చున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన సోషల్ సైన్స్ పాఠాన్ని శ్రద్ధగా విన్నారు. సుస్థిరమైన అభివృద్ధి సాధించాలంటే వనరుల సద్వినియోగం అవసరమని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలను కూడా ఇతరులు మరోసారి వినియోగించుకునేలా జాగ్రత్తగా వాడాలని సీఎం సూచనలు చేశారు. విద్యుత్, నీరు లాంటి వనరుల సద్వినియోగం సామాజిక బాధ్యత అంటూ విద్యార్థులకు వివరించి చెప్పారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల వైపు విద్యార్థులు దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రంలో ప్రగతి యజ్ఞం




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రపంచ ప్రఖ్యాత "ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఇఐయు)" ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు, వ్యాపార నిర్వహణకు దేశంలో అత్యంత అనువైన 4 రాష్ట్రాల్లో ఒకటిగా రూపొందిందని ఇచ్చిన నివేదిక...జగన్‌రెడ్డి ఐదేళ్ల విధ్వంసక పాలన నుండి రాష్ట్రం విముక్తి చెంది, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో వికాసం వైపు ఉరకలేస్తోందని స్పష్టం చేసిందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. 2025 సంవత్సరానికి ఇఐయు బుధవారంనాడు విడుదల చేసిన నివేదికలో పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రలతో పోటీ పడుతూ అత్యంత ఆకర్షణీయ రాష్ట్రంగా ఉందని వెల్లడించింది.

ఈ గణనీయ మార్పు ముఖ్యమంత్రి 'బ్రాండ్' విలువను మరోసారి వెల్లడించిందని మంత్రి నేడొక ప్రకటనలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలన పూర్తయిన తరుణంలో ఈ నివేదిక వెల్లడి కావడం...గత ఐదేళ్ల విధ్వంసం నుండి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషికి అద్దం పడుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం పేరు చెబితే ఆసక్తి కలిగిన పెట్టుబడిదారులు, అప్పటికే రాష్ట్రంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు భయంతో పారిపోయారని, ఆ చీకటి రోజులకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి మరియు ఐటి మంత్రి కృషి, దార్శనికలతో రూ. 9 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల్ని కేవలం మొదటి ఏడాదిలోనే ఆకర్షించడం విశేషమని మంత్రి అన్నారు. ఈ దిశగా సాగిన కృషి, ఫలితాలకు ఇఐయు నివేదిక ప్రతిబింబించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

భిన్న ధృవాలు

రాష్ట్ర వికాసానికి కంకణబద్ధులైన ముఖ్యమంత్రి ప్రగతి యజ్ఞాన్ని నిర్వహిస్తుంటే...దీనికి భిన్నంగా రప్పా...రప్పారెడ్డి ఎలియాస్ జగన్‌రెడ్డి తన విధ్వంసక యాగాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పరామర్శల పేరిట తనలో గూడు కట్టుకున్న అవధుల్లేని వినాశకర ధోరణుల్ని ప్రదర్శిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. బంగారుపాళ్యంలో బుధవారంనాడు జగన్ రెడ్డి చేసిన చేసిన రప్పా విన్యాసాలు దీనికి తాజా ఉదాహరణ అని మంత్రి తెలిపారు. ఈ దండుపాళ్యం ముఠా క్రీడలతో జరిగే మేలేంటంటే...విధ్వంసం, వినాశాలకు రప్పారప్పా రెడ్డి ఎలియాస్ జగన్‌రెడ్డి నిలువెత్తు ప్రతీక అని ప్రజలకు గుర్తు చేసినట్లవుతుందని మంత్ర తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతి యజ్ఞం, వినాశకర యాగాల తీరును విజ్ఞులైన రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

తోబుట్టువుల పట్ల నీచమైన ధోరణి

నెల్లూరు జిల్లాకు చెందిన ఒక మహిళా ఎమ్మెల్యే పట్ల అదే జిల్లాకు చెందిన వైసిపి మాజీ ఎమ్మెల్యే చేసిన దారుణమైన వ్యాఖ్యల్ని రప్పారప్పా రెడ్డి ఎలియాస్ జగన్ రెడ్డి ఖండించి, ఆయనపై చర్యలు తీసుకోకపోవడం వింతేమీ కాదని, అది మహిళల పట్ల జగన్ రెడ్డికున్న సహజ వైఖరిని మరోసారి వెల్లడించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. తాను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అండగా నిలబడి, తర్వాత తనతో విభేదించిన చెల్లి, తల్లి పట్ల జగన్ నీచమైన వైఖరికి తాజా ఘటన కొనసాగింపని మంత్రి తెలిపారు. అంత లోతుగా పాతుకుపోయిన నీచమైన వైఖరిలో మార్పు ఆశించడం అత్యాశే అవుతుందని...జగన్ రెడ్డి ఈ మహిళా వ్యతిరేక ధోరణిని ఆడపడుచులంతా గ్రహించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

అధిక జనాభా అనర్థం కాదు

సరైన విధానాలతో విలువైన మానవ వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలని, అధిక జనాభా అనర్థాలకు కారణమన్న అపోహ వీడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారంనాడు జరుగనున్న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. జనాభాపరంగా భారత్ తర్వాత ఉన్న చైనా, అమెరికాలు ఈ విషయాన్ని రుజువు చేశాయని ఆయన తెలిపారు.

ఈ ఆలోచన తోనే సరైన విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణలతో మానవ వనరుల సద్వినియోగంతో రాష్ట్రంలో ప్రగతికి కొత్త బాటలు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారని మంత్రి గుర్తు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలకు పటిష్టమైన ఆరోగ్య రక్షణ కవచాన్ని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం పలు రీతుల్లో కృషి చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రప్పారప్పా రెడ్డి ఎలియాస్ జగన్ రెడ్డి పాలనలో గాడితప్పిన ఆరోగ్య రంగాన్ని తిరిగి పట్టాలెక్కించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవల్ని అందుబాటులో ఉంచేందుకు పలు ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందాలతో విలసిల్లాలని మంత్రి ఆకాంక్షించారు.

# ఒప్పంద ప్రొఫెసర్ల నియామక కౌన్సిలింగ్‌ను నిలిపేయాలి

- **ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి జూలై 17న నిర్వహించనున్న కౌన్సిలింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీజీడీఏ) డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌ను కోరింది. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ నం. 7/2025 (తేదీ 9.7.2025) మేరకు 40 మంది ప్రొఫెసర్లు, 37 మంది అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకం ప్రతిపాదించగా, దీనిపై అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అసోసియేషన్ నాయకులు పేర్కొన్న ప్రకారం, ఇటీవల నిర్వహించిన బదిలీల సమయంలో పాత వైద్య కళాశాలల్లో అనేక పోస్టులను ఖాళీగా వదిలిపెట్టారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) మార్గదర్శకాలను పురస్కరించుకుని ఈ ఖాళీలను రెగ్యులర్ ప్రమోషన్ల ద్వారానే భర్తీ చేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఇటీవలే అనేక మంది డాక్టర్లు జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) అర్హతలు సాధించి ప్రమోషన్లకు అర్హులైన నేపథ్యంలో, ఈ నియామకాల ప్రక్రియను పునఃసమీక్షించడం అవసరమన్నారు. అలానే గతంలో నిర్వహించిన విధంగా 1:2 నిష్పత్తిలో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశాలు కాకుండా, ప్రభుత్వం 1:1 ప్రమోషన్లకే పరిమితమవ్వడం వల్ల అర్హులైన వారు అవకాశం కోల్పోయారని అసోసియేషన్ అభిప్రాయపడింది. ఇక, ఒప్పంద డాక్టర్లను నియమించినచో వారు ఎప్పుడైనా ఉద్యోగం వదిలి వెళ్లే ప్రమాదం ఉండటం, భవిష్యత్తులో రెగ్యులరైజేషన్‌కి ఒత్తిడి చేయడం వంటివి సమస్యలను తలెత్తించవచ్చని, ఇది రెగ్యులర్ సీనియర్ డాక్టర్ల పదోన్నతులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రతిపాదితమైన కొత్త మెడికల్ కాలేజీలు కొన్నే కావడంతో, ప్రభుత్వ నియామకాలు అవసరం అయ్యే కాలేజీలు తక్కువగా ఉన్నాయని, మిగతా కాలేజీలు పీపీపీ మోడల్‌కి మారిపోతుండటంతో ఒప్పంద నియామకాలు అసాధారణమవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ నియామకాలను పెద్ద సంఖ్యలో ప్రభుత్వ వైద్యులు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, వారి ఆందోళనలకు అనుగుణంగా ప్రభుత్వం స్పందించకపోతే అసోసియేషన్ ఆందోళన కార్యక్రమాలకు దిగేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్ బనాల పేర్కొన్నారు. ప్రభుత్వ నియామకాల వ్యవస్థపై వైద్యుల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే, ఒప్పంద నియామకాలను తక్షణమే నిలిపివేసి, డేటాను సమీక్షించి, రెగ్యులర్ ప్రమోషన్ల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతి నిలయాన్ని సందర్శించిన మంత్రి లోకేష్



### ❍ సీఎం చంద్రబాబుతో కలిసి శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్న మంత్రి

**పుట్టపర్తి (జర్నలిస్ట్ ఫైల్)**: కొత్తచెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం 2.0 అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. సాయికుల్వంత్ మందిరంలోని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో కలిసి దర్శించుకున్నారు. ప్రార్ధనలు చేశారు. అనంతరం ఓంకార్ మందిరంలో కొద్దిసేపు గడిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తో పాటు మంత్రి కె. అచ్చెన్నాయుడు, ఎంపీ బీకే పార్ధసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శాంతిభవన్ అతిథిగృహంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను మంత్రి లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

## సుపరిపాలనపై ప్రజల సంతృప్తి: ఎమ్మెల్సీ పంచుమర్తి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)**:మంగళగిరి 14వ వార్డులో జిల్లా టీడీపీ పద్మశాలియ సాధికారిక కార్యదర్శి జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం టీడీపీ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. వార్డులో నాయకులు ఇంటింటికి తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడారు. నియోజకవర్గంలో వారం రోజుల నుంచి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాల పర్యటనలలో ప్రజల నుండి లోకేష్ పరిపాలనపై మంచి స్పందన వస్తుందన్నారు. ప్రజలు తల్లికి వందనం, పింఛన్లు పంపిణీ, గ్యాస్ సబ్సిడీ పథకాలు బాగుంటున్నయని సంతృప్తినీ వ్యక్తం చేస్తున్నారన్నారు. మంత్రి లోకేష్ ఐటి ఇండస్ట్రీ, 20 లక్షల ఉద్యోగాల కల్పన చైర్మన్ గా, గంజాయి అరికట్టడానికి మెంబర్ గా, అనేక బాధ్యతలతో ఉన్నప్పటికీ నియోజకవర్గాన్ని కన్నబిడ్డలా అన్ని తానే చూసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు గౌడ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ వింజమూరు ఆషాబాల, టీడీపీ నాయకులు షేక్ రియాజ్, కొల్లి వేణుబాబు, వెనిగళ్ల భద్రయ్య, ఆకురాతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


## అట్టహాసంగా ప్రారంభమైన టౌన్ చర్చి శతవార్షికోత్సవాలు



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** వందసంవత్సరాలక్రితం రెవరెండ్ హాఫ్ దొర తెనాలి ప్రాంతానికి వచ్చి నిరుపేదల సేవతో పాటు దైవరాధనకు రూపొందిచిన టౌన్ చర్చి, కులాలకు మతాలకు అతీతమైనదని ఎఇఎల్ చర్చి కంట్రోలర్ కార్యదర్శి ఎన్. జేసురత్నకుమార్ టౌన్ చర్చి విశిష్టతను వివరించారు.

స్థానిక బోస్ రోడ్ లోని టౌన్ చర్చి శతవార్షికోత్సవ వేడుకలు గురువారం విశేష కార్యక్రమాలతో, ఆహ్లాదభరిత వాతావరణంలో ప్రారంభమైనాయి. సంఘసభ్యులతో ప్రారంభమైన ఊరేగింపు, అనంతరం, శతవార్షిక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక ఆరధనా కార్యక్రమాలు ప్రాధాన్యతను చాటుకున్నాయి. ఈక్రమంలో, క్రిస్టియన్ జేఏసీ ఉత్సవములు చైర్మన్ పిల్లి విద్యాసాగర్ అతిథులకు శుభాకాంక్షలతో ఆహ్వానించారు. చర్చి విశిష్టతను మీడియాకు వివరించారు. అతిథిగా విచ్చేసిన ఎన్ జేసురత్నకుమార్ మీడియాతో మాట్లాడుతూ చర్చి శత వసంతాల ఉత్సవాల నిర్వహణలో బాధ్యులైన వారికి అభినందనలు తెలిపారు. టౌన్ చర్చి నిర్మాణంలో హాఫ్ దొర ఈ ప్రాంతంలో నిరుపేదలకు అందించిన సేవలు వివరించారు. ఈనెల 12వ తేదీ వరకు కొనసాగే టౌన్ చర్చ్ శతవార్షిక ఉత్సవాలలో ప్రాధాన్యతా అంశాలను వివరించారు. ప్యారిస్ పాస్టర్లు దేవరపల్లి యేసు రత్నం, యామర్తి లెనిన్ బాబు, దగ్గు మళ్ళి సాల్మన్ రాజు, మత్తే విజయభాస్కర్ ప్రకాష్ బాబు లు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల కీస్తు ఏసు ఆరాధకులు పాల్గొన్నారు.


## శ్రీశైలంలో స్వచ్ఛాంధ్ర సేవా కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



**శ్రీశైలం ( జర్నలిస్ట్ ఫైల్ )** : శ్రీశైల దేవస్థాన పరిధిలో గురువారం స్వచ్ఛ ఆంధ్ర సేవా కార్యక్రమంలో భాగంగా విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ గురువారం నిర్వాహితమవుతున్న ఈ ప్రత్యేక శుభ్రత కార్యక్రమంలో ఈసారి పంచమఠాల ప్రాంతానికి ప్రాధాన్యతనిచ్చి, ప్రధాన వీధులు, మఠాల పరిసరాల్లో సమగ్రంగా శుభ్రత పనులు చేపట్టారు. కార్యక్రమం ప్రారంభానికి ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. అనంతరం ఘంటామఠం, భీమశంకరమఠం, రుద్రాక్షమఠం, విభూతిమఠం, సారంగధరమఠం తదితర ప్రాంతాల్లో మలినాలు తొలగించడం, రోడ్ల శుభ్రపరిచే పనులు, పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు వంటి శుభ్రత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు దేవస్థానం యూనిట్ అధికారులను, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించి, విభాగాల వారీగా సిబ్బందికి విధులు కేటాయించారు. శివసేవకులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సమిష్టిగా పాల్గొని ఈ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీశైలం దేవస్థానం పాలకమండలి పర్యవేక్షణలో స్వచ్ఛత కార్యక్రమాల పరంపర కొనసాగుతూ, భక్తులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా నిర్వహణ సాగుతోంది.

## నారా లోకేష్ ఆలోచనలతో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

### ❍ మంత్రి నాదెండ్ల మనోహర్




**తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్)** ప్రభుత్వ పాఠశాలల్లో, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో విద్యార్థుల విద్యా అధ్యయనానికి అధిక ప్రాధాన్యత లభిస్తుందని మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాల ద్వారా చక్కని అవగాహన ఏర్పడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతు విద్యార్థులు చదువుకోవడంతోపాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలకు ప్రాధాన్యత కల్పించిందన్నారు. తెనాలి నియోజకవర్గంలోని పాఠశాలల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య తో పాటు, సామాజికపరమైన అంశాలపై కూడా అవగాహన పెంచడమే కార్యక్రమ లక్ష్యం అన్నారు. చదువుకునే వయసులో చెడు అలవాట్ల జోలికి పోకుండా మంచి వాతావరణం పాఠశాలల ప్రాంగణంలో, పరిసరాల్లో ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రధానంగా తెనాలిలో మాదక ద్రవ్యాలను మట్టుపెట్టే కార్యక్రమానికి తగు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహించే మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశాల ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 44 వేల పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలకు ప్రభుత్వ ఇచ్చిన ప్రాధాన్యతను వివరించారు. ఈగల్ టీమ్ ఎస్పీ నాగబాబు మాట్లాడుతు, విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళరాదన్నారు. జీవితాన్ని నాశనం చేసె చెడు అలవాట్ల వల్ల, సమాజంలో అనేక సమస్యలకు కారణమవుతారని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల విద్యావిధానంపై దృష్టి పెట్టాలన్నారు. చెడు అలవాట్లకు చదువుకునే వారె త్వరగా దగ్గరవుతున్నారనే భావన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మెరుగైన విద్యా సేవలు చేరువచేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి వారు తీసుకునే మొక్కను మూడు సంవత్సరాల వరకు పరిరక్షించాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అధికారులు ప్రజాప్రతినిధులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనాసింహ, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీపతి, డీఎస్పీ బీ జనార్ధన్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ టి రాధిక, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, ఎమ్ఇఒ టు, జయంత్ బాబు, తహాశీల్దార్ కె వి గోపాలకృష్ణ, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు............

## విద్యే విజయానికి గురువు : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** "మెగా టీచర్స్, పేరెంట్స్ మీట్" మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక గొప్ప గురువు, ఆ విద్యే విజయానికి గురువు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అంజుమన్ పాఠశాలతోపాటు ఇతర స్కూళ్లలో గురువారం మెగా టీచర్స్, పేరెంట్స్ మీట్ నిర్వహించారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ లో నైపుణ్యం సాధించేలా మార్చాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా మేగా టీచర్స్, పేరెంట్స్ మీట్ ఏర్పాటు చేయించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న ఈ కార్యక్రమందేశాన్నే ఆకర్షించిందని తెలిపారు. గొప్ప సాధకులుగా ఎలా తయారవ్వాలి ? అనే అంశాలపై మదింపు చేయడమే మెగా టీచర్స్, పేరెంట్స్ మీట్ లక్ష్యమని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో విద్యార్థులకు ఎలాంటి సాయం అవసరమైనా తాను 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందిస్తామని హామీ ఇచ్చారు. విద్య ద్వారానే జీవితాలు మారతాయని స్పష్టం చేశారు.

**అంజుమన్ పాఠశాల చరిత్రలో తొలిసారి మధ్యాహ్న భోజన పథకం**

అంజుమన్ ఏ ఇస్లామియా పాఠశాల చరిత్రలో ఎన్నడూలేని విధంగా మధ్యాహ్న పథకం అమలుకు ఎమ్మెల్యే నసీర్ తీవ్రంగా కృషి చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వ పెద్దల వద్దకు సమస్యను తీసుకెళ్లి సాధించారు. ఈ క్రమంలో మెగా టీచర్స్, పేరెంట్స్ మీట్ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అంజుమన్ ఏ ఇస్లామియా పాఠశాలలో ప్రారంభించారు. ఈ పాఠశాలలో ఈ పాఠశాలలో మొత్తం 8 వందల మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అంజుమన్ ఏ ఇస్లామియా పాఠశాలలో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లను అందజేశారు. ఈ కిట్ల ద్వారా రూ. 2500 విలువ చేసే విద్యా సంబంధిత సామగ్రి అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, టిడిపి రాష్ట్ర నాయకులు చిట్టా బత్తిని చిట్టిబాబు, కార్పొరేటర్లు ఎల్లవుల అశోక్, షేక్ మీరావలి, ఇర్రి ధనలక్ష్మి, అన్వర్, జాబి, బెల్ళ వెంకటేశ్వర్లు, పిచ్చి రెడ్డి, జాగర్లమూడి శ్రీనివాస్, మువ్వ శైలజ, మేకల రవీంద్రబాబు, ఏడుకొండలు, కన్నెబోయిన సాయి, వెంకట రమణ, బట్ట రాజా, అల్లం బాజీ, షేక్ రియాజ్, ఇర్రి సాయి కందుకూరి వెంకట్, హేమంత్, షౌఖత్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పాఠశాలల్లో "మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్"




**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్)** : పిల్లల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమంను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు జరుగుతుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు. మంగళగిరి పట్టణం వీవర్స్ కాలనీలోని ఎంటీఎంసీ హైస్కూలులో "మెగా పేరెంట్స్ %-% టీచర్స్ మీటింగ్" ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో స్కూల్ చైర్మన్ వంగర హనుమాన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాదని, ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి వారి పిల్లల చదువు క్రమశిక్షణ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ఏ సబ్జెక్టులో పిల్లలు వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆ పిల్లల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఇదే మెగా పేరెంట్ టీచర్స్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 45,094 పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. సుమారు రెండు కోట్ల మంది విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి భాగస్వామ్యం అయ్యారన్నారు. విద్య శాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం నిధులను జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని తెలిపారు.

టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ గురువును పూజిస్తే దేవుడిని పూజించినట్లేనని ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు గౌరవంతో ఉండాలని అప్పుడే పిల్లలకు చదువు బాగుంటుందని, మంచి నడవడిక వస్తుందని అన్నారు. ఎన్డీయే కూటమి పాలనలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ సారధ్యంలో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, నాణ్యమైన ఆహారం, మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని ప్రతీ పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ప్రతీ విద్యార్థికి "తల్లికి వందనం" పథకం ద్వారా నగదును అందచేయటం జరిగిందన్నారు. ప్రతీ ఒక్కరూ విద్యను అభ్యసించటం ద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు

గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ టీచర్స్, పేరెంట్స్ మధ్య ఒక అవగాహనతో కూడిన సత్సంబంధాలు మెరుగు పరిచేందుకు ఈ మెగా మీటింగ్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె శకుంతల, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, రాష్ట్ర నాయిబ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరి రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, స్కూలు వైస్ చైర్మన్ బిట్రా చెన్న కేశ్వరి, సీనియర్ నాయకులు వంగర పెదలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్)**: తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని కొండపాటూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, పూర్వ విద్యార్థి యార్లగడ్డ అంకమ్మ చౌదరి తెలిపారు. కాకుమాను మండలం కొండపాటూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వేడుకగా చేపట్టిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ మెగా సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు పునాది నుంచే సత్ప్రవర్తనతో మెలగాలని, చక్కటి క్రియేటివిటీతో వినూత్నంగా ఆలోచిస్తూ సత్ఫలితాలు పొందాలన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు కూడా గురువులని, పిల్లలపై ఒత్తిడి పెంచకుండా వారికి ఇష్టపడే విధంగా చదివించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా కృషి చేసి కొత్తగా ఏర్పడిన హైస్కూలుకు మంచి పేరు తీసుకు రావాలని అంకమ్మ చౌదరి సూచించారు.

సీనియర్ జర్నలిస్ట్ టీడీ ప్రసాద్ మాట్లాడుతూ తమ పిల్లలను బడిలో చేర్పించాం కదా బాధ్యతంతా ఉపాధ్యాయులదేననే భావన విద్యార్థుల తల్లిదండ్రులకు ఉండకూడదన్నారు. పిల్లలు ఇంటికొచ్చాక వారి చదువుల విషయమై శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. అలా అయితేనే వారి పిల్లల నుంచి మెరుగైన ఫలితాలు రాబట్టగలుగుతారన్నారు. పిల్లలకు స్కూలు నుంచి వచ్చే సమాచారం చూసుకునే వరకే సెల్ ఫోన్లు ఇవ్వాలని, ఆ తర్వాత వాటిని వారికి దూరం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. సెల్ ఫోన్లకు విద్యార్థులు బానిసలైతే వారి జీవితాలే తారుమారై పోతాయని చెప్పారు. పట్టుదలగా చదివి ఉన్నత పదవిని పొందడానికి తాను మూడేళ్లు సెల్ ఫోను చూడలేదని ఓ కలెక్టరు చెప్పడం పేపర్లలో వచ్చిందన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. తాను ఇదే పాఠశాలలోనే చదివానని, ఈ పాఠశాల నుంచే అనేక మంది ఉన్నత స్థాయిల్లో ఉన్నారని అలాంటివారిలో కాటూరి మెడికల్ కాలేజీ హాస్పటల్ అధినేత కాటూరి సుబ్బారావు, అలాగే యార్లగడ్డ అంకమ్మ చౌదరి, ఎందరో ఎన్నారైలు ఉన్నారని పేర్కొన్నారు. మాజీ ఉపాధ్యాయుడు మండవ లక్ష్మినారాయణ మాట్లాడుతూ విద్యార్థుల గుణగణాలను గ్రహించి విద్యా బోధన చేసి నూరు శాతం ఫలితాల సాధనకు అందరూ కృషిచేయాలని సూచించారు. ఇక్కడ టెన్త్ లో వరుసగా మూడేళ్లు టాప్ ర్యాంకులు తెప్పిస్తే సమీప హైస్కూళ్ల నుంచి కూడా విద్యార్థులు వచ్చి చేరతారని చెప్పారు. గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కమలహాసన్ మాట్లాడుతూ దాతలు, గ్రామస్థుల సహకారంతో హైస్కూలుగా మారిన పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు చేయాల్సిన కృషి కూడా ఉందని తెలిపారు. ఇళ్ల వద్ద తమ పిల్లల చదువుల విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు ప్రసంగిస్తూ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు బోధించే నిపుణులైన సీనియర్ ఉపాధ్యాయులు ఉన్నారని, తమ పరంగా ఎలాంటి లోపం లేకుండా విద్యాబుద్ధులు నేర్పిస్తున్నామన్నారు. అదనంగా ఇద్దరు వాలంటీర్లకు వేతనాలు ఇస్తూ ఏర్పాటు చేసిన విద్యాదాత యార్లగడ్డ అంకమ్మ చౌదరికి ప్రకాశరావు కృతజ్ఞతలు తెలిపారు. ఎలిమెంటరీ స్కూలు హెడ్ మాస్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థులను తీర్చి దిద్దడంలో శక్తి వంచన లేకుండా తమ టీచర్లందరం పని చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమకు సహకరించి తమ పిల్లలు ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చూడాలని కోరారు. తొలుత విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీలను మండల విద్యా శాఖ అధికారి కెన్నడీ ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షర్మిలా బేగం, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యా కమిటీ చైర్మన్ నాగాంజనేయులు, గ్రామ పెద్దలు గన్నపనేని రాఘవరావు, అంకినీడు, గాంధీ, ముప్పలనేని ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పండుగలా మెగా పేరెంట్స్ మీటింగ్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)** : మంగళగిరి మండలం చినకాకాని గ్రామం ముప్పవరపు సరోజనమ్మ రామయ్య జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు టీచర్ల సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంకు ముఖ్యఅతిథిగా మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు హాజరై విద్యార్థులకు నారా లోకేష్ గారు పంపిన నోట్ బుక్స్ ను అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా రెండో ఏడాది ఈ సమావేశం నిర్వహించడం ఆనందం గా ఉందని, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పల్లబోతుల శ్రీనివాసరావు తెలిపారు

ఈ కార్యక్రమంలో గాదె పిచ్చిరెడ్డి, గుమ్మా హరిబాబు, దానబోయిన రామరాజు, గుర్రం నరసింహారావు, పలగాని గంగాధర్, బుల్లా నాగేశ్వరరావు, భూక్యా సురేష్, ప్రవీణ్ రెడ్డి, కుక్కమళ్ళ శ్రీనివాసరావు, సుంకర రామారావు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వశాంతి కోసం చాతుర్మాస దీక్ష




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** విశ్వశాంతి పరిడవిల్లాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో విలసిల్లాలనె సంకల్పంతో చాతుర్మాస దీక్షను చేపట్టినట్లు పెనుగొండ శ్రీ వాసవి పీఠం పీఠాధిపతులు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని కమీషన్ మర్చంట్స్ అసోసియేషన్ భవనమునందు గురువారం శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి స్వీయ పర్యవేక్షణలో అర్ధచాతుర్మాస దీక్ష కార్యక్రమాలను పలు ఆధ్యాత్మిక సేవలతో ప్రారంభించారు. రెండు నెలల పాటు హనుమాన్ చాలీసా పారాయణ నిర్విరామంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురు పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యేక పూజలలో మహిళా భక్తులు విశేషంగా పాల్గొని గురుపూజ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 5 గంటలకు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి చంద్రమౌళేశ్వరస్వామికి, విశేష అభిషేక పూజలు నిర్వహించారు. శ్రీ సాలిగ్రామ మఠం, శ్రీ పీఠం సంయుక్త నిర్వహణలో సెప్టెంబర్ 7వ తేదీ వరకు అర్థ చాతుర్మాస దీక్షలు కొనసాగుతాయని, శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి వివరించారు. అదేవిధంగా గురు పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ గుంటూరు కృష్ణాజిల్లాల అధ్యక్షులు గడ్డిపాటి శ్రీనివాస్ రావు నేతృత్వంలో తెనాలి పరిసర ప్రాంత సంకీర్తన బృందాలచే నామ సంకీర్తన కార్యక్రమం విశేషంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమాలలో, సాలిగ్రామ మఠం చైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సలహామండలి చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, కోశాధికారి గోపురామకృష్ణ, సహాయకార్యదర్శి ఎమ్. రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కారు"మంచి" మనస్సు



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్)**:ప్రతి ఒక్కరూ చదవాలి అందరూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలని మంచి మనసుతో కాకుమాను గ్రామంలో విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, కాకుమాను సమగ్రాభివృద్ధి సంస్థ చైర్మన్ కారుమంచి. ప్రసాద్ బాబు ప్రతి ఏటా తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది పది ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి అయిదు మంది విద్యార్దులు రత్నారాజు(577), రిషిత(562) అస్మా (561), అనిల్(560), శిరీష (560) అను విద్యార్దులకు ఒక్కొకరికీ 15 వేల రూపాయలు చొప్పున నగదు బహుమతిని బహుకరించారు. పాఠశాల నందు జరిగిన కార్యక్రమం లో అధికారులు చేతుల మీదుగా నగదు ను విద్యార్దులకు అందజేశారు. ఈ సందర్భముగా కాకుమాను గ్రామ సమగ్రాభివృద్ధి సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగానే ఈ విద్యాసంవత్సరం కూడా కాకుమాను గ్రామంలో గల పాఠశాలలో సాయంత్రం వేళ విద్యార్దులకు స్టడీ అవర్స్ నిర్వహించేందుకు గాను ప్రతి నెల 50 వేల రూపాయల నగదు కారుమంచి. ప్రసాద్ బాబు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమం కు హాజరు కాలేకపోయిన ప్రసాద్ బాబు విద్యార్థుల శ్రమ ఫలించింది ఈ బహుమతులు వారికి మరింత ఉత్తమంగా రాణించేందుకు ప్రోత్సాహం కలిగిస్తాయని ప్రత్యేక సందేశం ను పంపినారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ బి. వెంకట స్వామి, ఎంపిడిఓ యుగ కీర్తి, టీడీపీ కాకుమాను మండల అధ్యక్షులు మామిళ్లపల్లి. రాం గోపాల్, హెచ్ ఎం భాస్కర్, జవహర్ రాణి, పూర్ణ చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం



**బ్రహ్మంగారిమఠం జర్నలిస్ట్ ఫైల్** గోవిందమాంబ బాలికల హైస్కూల్ నందు తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల చేత ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది పదవ తరగతిలో మండల టాపర్ గా నిలిచిన విద్యార్థులకు అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఉపాధ్యక్షులు నరసింహ గౌడ్ ఎంపిటిసి మనోహరాచారి సర్పంచ్ వైవి సుదర్శన్ రెడ్డి స్కూల్ స్థల దాత నోస్సం. వీరభద్ర స్వామి మొదలగు వారు పాల్గొన్నారు.

**వరుణ్ హై స్కూల్ నందు** ...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న వాటిలలో పిటిఎం 2.0 కార్యక్రమం ఒకటి. అందులో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వరుణ్ హై స్కూల్ నందు కరస్పాండెంట్ ఎలిచెర్ల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అగ్రికల్చర్ అధికారి సాయికుమార్ అధ్యక్షతన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం వైభవపేతంగా జరిగింది. అందులో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు ఒకరికి ఒకరు పోటీలు పడి ముగ్గులు వేసి ఎవరికివారు తీసుపోని విదంగా ముగ్గులపై రంగులద్ది పిటిఎం 2.0 వచ్చేలాగా కొందరు వేయగా, మరికొందరేమో గురువారం గురు పౌర్ణమి కాబట్టి గురుపౌర్ణమి వచ్చేలాగా ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. అలాగే మ్యూజికల్ చైర్స్ ఆటలో మహిళా మణులు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందంగా కుర్చీలాట ఆడారు.

# కీలక పోస్టుల భర్తీకి చర్యలు

## ఎంవిఐ పాసింగ్ పెరేడ్‌లో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్




బుధవారం ఎంవిఐల గౌరవ వందనం స్వీకరిస్తున్న రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించదానికిరవాణా శాఖలో పలు కీలక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.బుధవారం రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన 96 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంవిఐల గౌరవ వందనం స్వీకరించి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏవీఎంబలకు ఆవార్డులు ప్రదానం చేశారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎంవీఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో అనేక ప్రజా యుత కార్యక్రమాలు తెచ్చిందని దాంతో తెలంగాణ రవాణా శాఖ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న పిఎంవీఐలు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మీ శక్తి ఉపయోగించాలని యాక్సిడెంట్‌లో డెత్ రేట్ తగ్గించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘన చేస్తున్న వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తూ కఠినంగా వ్యవహరించాలని సూచించారు.రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్( ఏఐ) తీసుకొచ్చి వెహికిల్ ఫిట్‌నెస్ చేస్తున్నామన్నారు. మీరంతా రవాణా శాఖలోకి రావడంతో ఈ డిపార్ట్ మెంట్ మరింత పటిష్టమైందన్నారు.దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో గాయపడితే క్యాష్ లెస్ ట్రీట్మెంట్ విధానం కేంద్రం తీసుకొచ్చిందని, రోడ్డు ప్రమాదాలు నివారించేలా చర్యలు తీసుకో వాలని ఇప్పటికే విధుల్లో ఉన్న 300కి పైగా సిబ్బందికి 2నెలలచొప్పున శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.హైదరాబాద్‌లో ఈవీ, సిఎన్జీ ఎల్పీజ్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.దేశంలో రవాణాశాఖలో నియామకం అవుతున్నవారందరికీ మీరు రోల్ మోడల్‌గా ఉండాలని,జిల్లా అధికారులతో సమన్వ యం చేసుకుంటూ మంచి పేరు తెచ్చుకుని మీ తల్లితండ్రులతో పాటు మీ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# మూతపడిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణకు సహకరించండి

## కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామికి విజ్ఞప్తి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణాలో మూతపడిన రెండు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణకు చొరవ చూపాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణకు కేంద్ర మంత్రి హెచ్ డి కుమార స్వామి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సిసిఐ, ఎస్ఐఐఎల్ పై కేంద్రమంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి,ఉపాధి కల్పన రంగాలను బలోపేతం చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణకు నోచుకున్నట్లుగానే సిసిఐ,ఎస్ఐఐఎల్‌ల పునరుద్ధరణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి ఈ సందర్భంగా ఆయనకు వివరించారు.సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణ అవసరాన్ని, ప్రాధాన్యతను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి తెలిపారు.గతంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణను రూ. 5000 కోట్లతో చేపట్టిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఆదిలాబాద్ లోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) మూతపడడానికి దారితీసిన పరిస్థితులను,ఈ పరిశ్రమల పునరుద్ధరణతో యువతకు ఉపాధి అవకాశాల మెరుగుదల, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి వివరించారు. వెనుకబడిన, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ పరిశ్రమల పునరుద్ధరణతో ప్రాంతీయాభివృద్ధిలో సమతుల్యత సాధ్యమై రాష్ట్రం,దేశం ప్రగతిబాటలో పయనిస్తాయని కేంద్రమంత్రికి వివరించారు.ఆర్థిక, సామాజిక పురోగతికి దన్నుగా నిలిచే ఈ పరిశ్రమలను పునరుద్ధరించాల్సి ఒదిగా కోరారు.సమగ్ర వివరాలతో కూడిన లేఖను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి అందించారు.ఈ నెలాఖరులో తెలంగాణ రాష్ట్రానికి వచ్చి, తెలంగాణలో నెలకొని వున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పనితీరుతో పాటు, సంబంధిత పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు చేపట్టే దిశగా సమీక్షను నిర్వహిస్తానని కేంద్రమంత్రి మంత్రి శ్రీధర్ బాబుకు స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేరకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు అమలు చేయపోతే యుద్ధమే: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్,జూలై10(జర్నలిస్ట్‌ఫైల్)**స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో జారీ చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని లేకుంటే రాష్ట్రంలోని బిసిలంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజారామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4), ఆర్టికల్ 16 (4) ప్రకారం ఏ వర్గాలకైతే సరైన ప్రాతినిధ్యం లేదని భావిస్తే.. కుల గణన లెక్కల ఆధారంగా వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. ఇటీవల బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కులగణన ద్వారా 63 రిజర్వేషన్లు ఇచ్చి, బీసీలకు లక్షకుపైగా ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అధికారం తమ చేతుల్లో ఉన్న.. కేంద్ర ప్రభుత్వంపైకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను మోసం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లితే మండల్-2 ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీసీ హిందూ ఆజాది జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వరులు, బీసీ అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లోడంగి గోవర్ధన్ యాదవ్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసుకే యాదవ్, గొర్ల కాపరుల సంక్షేమ సంఘంరాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడు అంజి యాదవ్, శ్రీరామ్ యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అభయ హస్తం దరఖాస్తు గడువు పెంపు

**హైదరాబాద్, జూలై 10(జర్నలిస్ట్‌ఫైల్):** కార్పోరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రారంభించిన సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు.ఈమేరకు హైదరాబాద్‌లో బుధవారం ఒక ప్రకటనలో ఈ పథకం ద్వారా రాష్ట్రం నుండి సివిల్స్ ప్రిలిమ్స్‌లో పాసై మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు గడువు ఈనెల 7వ తేదీతో ముగిసిపోయిందని, అయితే అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకుదాన్ని ఈ నెల 12వ తేదీ వరకుపెంచుతూనిర్ణయంతీసుకున్నట్లు వెల్లడించారు.



బుధవారం చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ, దుర్గానరేశ్ తదితరులు

# 23, 24 తేదీలలో 'చలో ఢిల్లీ' : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై10(జర్నలిస్ట్‌ఫైల్):**దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలకు పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23, 24 'చలో ఢిల్లీ' పేరిట ఓబిసి జాతీయస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ సదస్సులకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి బిసిలు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రెండు లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు కవిత హైందవి, జోషి, రవియాదవ్, పగిళ్ళ సతీష్, జిల్లపల్లి అంజీ, రాందేవ్, నిఖిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐ రామకృష్ణపై దాడిని ఖండించిన తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

**హైదరాబాద్,జులై10(జర్నలిస్ట్‌ఫైల్):** కోర్ట్ ఆదేశాల మేరకు విధి నిర్వహణలో భాగంగా ఫీల్డ్ ఎంక్వయిరీకి వెళ్ళిన గద్వాల మండలం,జోగులాంబ గద్వాల జిల్లా రెవిన్యూఇన్స్పెక్టర్ రామకృష్ణపై జరిగిన దాడిని తెలంగాణ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్రకమిటి తీవ్రంగా ఖండిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి,ప్రధాన కార్యదర్శి బిక్షం ఒక ప్రకటనలో తెలిపారు.క్షేత్ర స్థాయిలో సిబ్బంది లేకున్న అనేక కష్ట నష్టాలకు ఓర్చి విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లపై దాడులు దురదృష్టకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. నిబద్ధత, అంకిత భావంతో పనిచేస్తున్న రెవిన్యూ కుటుంబసభ్యులకు రాష్ట్రకమిటి అన్ని వేళలలో, అన్నిరకాలుగా అండగా ఉంటుందన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు వేగవంతానికి కీలక నిర్ణయం

## ప్రాజెక్ట్ డైరెక్టర్లుగా గ్రూప్-1 అధికారులు

**హైదరాబాద్,జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలును వేగవంతం చేయడానికి కీలక చర్యలు తీసుకుంటోంది. జిల్లాల హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లుగా గ్రూప్1 అధికారులను (డిప్యూటీ కలెక్టర్లు) నియమిస్తోంది. ఇప్పటివరకు 3.71 లక్షల ఇళ్లు మంజూరు కాగా 40 శాతం లోపే గ్రౌండింగ్ అయ్యాయి. సిబ్బంది కొరత, నిధుల జాప్యం, నిర్మాణ సామగ్రి ధరలు, లబ్ధిదారుల ఎంపికలో అస్పష్టత వంటివి జాప్యానికి కారణాలుగా అధికారులు భావిస్తున్నారు. ఈ సవాళ్లను అధిగమించి పథకాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా గ్రూప్ 1 అధికారులను పీడీలుగా నియమిస్తోంది. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్, నిజామాబాద్, గద్వాల, మహబూబాబాద్, కరీంనగర్ జిల్లాలకు కొత్తపీడీలను నియమించారు. వీరంతా రెవెన్యూశాఖలో డిప్యూటీ కలెక్టర్ల స్థాయి అధికారులు. వీరిని డిప్యుటేషన్‌పై గృహనిర్మాణ శాఖకు బదిలీ చేశారు.సాధారణంగా హౌసింగ్ పీడీలుగా ఎస్ఈ (సూపర్ఇంటెండెంట్ ఇంజనీర్) స్థాయి అధికారులు ఉంటారు. ప్రస్తుతం పలు జిల్లాల్లో డీఈఈ (డివిజనల్ ఇంజనీర్), ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)లు పీడీలుగా కొనసాగుతున్నారు. అయితే, వీరి పర్యవేక్షణలో పథకం అమలు అనుకున్నంత వేగాన్ని అందుకోలేకపోవడంతో పలు జిల్లాల్లో పథకం నత్తనడకన సాగుతోంది. ఈ నేపథ్యంలో పథకం అమలులో వేగం పెంచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా,సూర్యాపేట, సిరిసిల్ల, వనపర్తి జిల్లాలకు హౌసింగ్‌శాఖలోని సీనియర్ అధికారులను పీడీలుగా నియమించారు. ఈ నియామకాలు పథకం అమలులో జాప్యాన్నితగ్గించి, వేగాన్ని పెంచుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. హౌసింగ్ శాఖలో సిబ్బందికొరత పథకం అమలులో ఒక ముఖ్యమైన అడ్డంకిగామారింది. ఈ సమస్యను అధిగమించడానికి, ప్రభుత్వం మండలానికి ఒక్కో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) చొప్పున పొరుగుసేవల పద్ధతిలో 712మందిని నియమించాలని భావించింది. వీరితో పాటు, డీఈఈలు (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు), వర్క్ ఇన్‌స్పెక్టర్ల నియామకాలను కూడా చేపట్టనున్నట్లు ప్రకటించింది. అయితే, ఇప్పటివరకు కేవలం 315మందిని మాత్రమే నియమించారు. మిగతా వారి నియామకానికి ప్రభుత్వం నుండి అనుమతి రావాల్సి ఉంది. ఈ నియామకాలు పూర్తయితే, క్షేత్రస్థాయిలో పథకం అమలు పర్యవేక్షణ మరింత మెరుగుపడుతుందని అంచనా. ప్రస్తుతం జీహెచ్ఎంసీ మినహా రాష్ట్రంలోని మిగిలిన 32 జిల్లాల పరిధిలో 3.71 లక్షల ఇళ్లను మంజూరు చేశారు.

# విద్యార్థులకు మోడీ కిట్స్ ఇస్తా

## సైకిళ్లు పంపిణి చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్



బుధవారం కరీంనగర్‌లో పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణి చేస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ టౌన్,10(జర్నలిస్ట్‌ఫైల్):**కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పదవతరగతి చదివే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమానికి హాజరయ్యారు. మొత్తం 20 వేల సైకిళ్లను స్వయంగా కొనుగోలు చేసిన బండి సంజయ్ వాటిని దశల వారీగా పంపణీ చేసే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మొదట కరీంనగర్‌టౌన్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య,జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్వినీ, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి,ఆర్డీవో, డీఈవోతోపాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ సమాజానికి సేవ చేయాలనే మా లో ఎప్పటికప్పుడు స్ఫూర్తినింపిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు.వారి బాటలో నడుస్తూ మాకు చేతనైనంత సాయం చేస్తున్నాం. ఈ సైకిళ్ల పంపిణీ ఆలోచన ఇచ్చిందే జిల్లా కలెక్టర్. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో బాలికలకు సైకిళ్లు ఇస్తే బాగుంటుందని జిల్లా కలెక్టర్ ప్రతిపాదించారు. ఆ ఆలోచనతోనే టెన్త్ విద్యార్థినీ, విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నం. ఇవి ప్రభుత్వ నిధులు కావు. అట్లని నేను కోట్లు ఖర్చు పెట్టేంత సంపన్నుడిని కాదు. మా దగ్గరకు వచ్చిన కొందరు కార్పొరేట్ కంపెనీల యాజమానులను మీరు సంపాదించిన సొమ్ములో కొంత సీఎస్సార్ ఫండ్ కింద ఇవ్వాలని కోరితే వారు సానుకూలంగా స్పందించి ఆ నిధులు అందిస్తే వాటితో సైకిళ్లను కొని మీకు పంపిణీ చేస్తున్నా. నేను కూడా చిన్నప్పటి నుండి మీలాగే పేదరికంలో పెరిగిన. ఇక్కడే కాపువాడలో పుట్టి పెరిగిన. తినడానికి ఇబ్బంది పడ్డ. మా తల్లి దండ్రులు మమ్ముల్ని ఎంతో కష్టపడి చదివించారు. కష్టాలు తెలిసిన వ్యక్తిని కాబట్టే మీరు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని సైకిళ్లను పంపిణీ చేస్తున్నా. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో రోల్ మోడల్. ఒడిశా నుండి వచ్చి కష్టపడి పని చేస్తూ మీఅందరికీ స్ఫూర్తిగా ఉన్నారు. పోలీస్ కమిషనర్ బీహార్ నుండి ఇక్కడికి వచ్చారు. ఆయన తండ్రి మిలటరీలో పనిచేశారు. క్రమ శిక్షణతో ఎదిగి వచ్చారు. వీళ్లే కాదు... మహాత్మా గాంధీ, అంబేద్కర్, మోదీ కూడా పేదరికం నుండి ఎదిగిన వాళ్లే.ముఖ్యంగా అంబేద్కర్ ఎన్ని కష్టాలు అనుభవించారో, అంటరానితనాన్ని ఎదుర్కొన్నారో మాటల్లో చెప్పలేం. ఇప్పుడు మీ కష్టాలను తీర్చడానికి మోదీ ఉన్నాడు. మా హయాంలో ఆదుకునే వాళ్లే లేరు.మోదీ ప్రభుత్వం విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. యూపీఏ హయాంలో (2014 15 బడ్జెట్‌లో) విద్యా రంగానికి కేంద్రం 68 వేల 728!!కోట్లు మాత్రమే కేటాయిస్తే. ఈ ఒక్క ఏడాదే(2025 26) 1 లక్షా 28వేల 650 కోట్ల రూపాయలు కేటాయించింది. అంటే యూపీఏతో పోలిస్తే విద్యా రంగానికి నిధుల కేటాయింపు రెట్టింపు పెరిగింది. ఈ 11 సంవత్సరాల్లో ఒక్క విద్యా రంగానికే దాదాపు 8!!లక్షల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేశామంటే విద్యా రంగంపై మోదీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అయితే...ఇన్ని నిధులు ఖర్చు చేస్తున్నా విద్య అనేది 1976 వరకు రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం కూడా నిధులు కేటాయిస్తుంది. అయితే పాఠశాలలను నడిపే బాధ్యతను, స్థానిక భాషలో పాఠ్యాంశాలు బోధించే అంశాలను అమలు చేయాల్సింది మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే. ఎందుకంటే కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో విద్యా రంగం ముందుకు సాగుతుందనే నమ్మకంతోనే ఈ జాతీయ విద్యా విధానాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చింది.మీకందిస్తున్న సైకిళ్లు మోదీ గిఫ్ట్. అతి త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అతి త్వరలో "మోదీ కిట్స్"ను అందజేయబోతున్నాం. ఎన్ని వేల మంది ఉన్నా, ఎన్ని లక్షల మంది ఉన్నా వాళ్లందరికీ మోదీ కిట్స్‌ను అందిస్తామని అన్నారు.

# నియోజక వర్గాల్లో పంచాయితీలు సహజం

## మంత్రి వివేక్ వెంకట స్వామి



బుధవారం గాంధీభవన్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):** బిఆర్ఎస్‌లో కెటిఆర్, కవితకు మధ్యనే పంచాయితీ ఉన్నప్పుడు నియోజవర్గాల్లో పంచాయితీ సహజం అని అన్నారు మంత్రి వివేక్. అందర్నీ కలుపుకుపోయి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో ప్రజల వినతులు స్వీకరించిన మంత్రి..సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి కొన్ని లైవ్ లోనే పరిష్కరించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి గత బీఆర్ఎస్ పాలనపై విమర్శలు గుప్పించారు. గత10 ఏండ్లు మంత్రులతో ప్రజలు మాట్లాడే అవకాశం లేదని అన్నారు మంత్రి వివేక్. కానీ తమ ప్రభుత్వంలో ర్జాగా మంత్రులను కలిసే అవకాశం ఉందని చెప్పారు. బీఆరెస్ హయాంలో పోలీసుల పహారా ఉండేదని.. కానీ తమ ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఎవ్వరిపైనా కేసులు కూడా పెట్టలేదని గుర్తు చేశారు.గత బిఆర్ఎస్ ధర్నా చౌక్ ఎత్తివేసిందని కానీ తమ ప్రభుత్వం ధర్నాలకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పాలన అందిస్తుందని అన్నారు.పాశమైలారం ఘటన జరిగిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారని.. కానీ గతంలో కొండ గట్టు ఘటన జరిగితే కేసీఆర్ పోయిన పాపాన పోలేదని విమర్శించారు. పాశమైలారం ఘటన వద్దకు సీఎం వెళ్లినా కూడాసీఎం వెళ్ళలేదని కేటీఆర్ ట్వీట్ చేయడంపై మంత్రి మండిపడ్డారు.పిసిసి చీఫ్ మహేష్ కుమార్ ఇన్షియేటివ్ తో మంత్రులతో ముఖాముఖీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే మంత్రితో ముఖాముఖి కార్యక్రమం అన్నారు.మంత్రులు, ఎమ్మెల్యేలు జనంలో ఉండాలని సీఎంఆదేశించారని చెప్పారు.నియోజకవర్గంలో ఎమ్మెల్యేలే సుప్రీం అని అన్నారు మంత్రి వివేక్. ఇన్నాళ్లుగా పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టత ఇచ్చారని తెలిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జాయిన్ అయ్యి పార్టీ కోసం పనిచేసిన వారికి కూడా కొంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారని అన్నారు. పీసీసీ పదవులు.. పార్టీ పదవుల గురించి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పరిశీలిస్తున్నారని తెలిపారు. పాత, కొత్త విబేధాలు లేవనీఅందరినీ కలుపుకుని ముం దుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.గురువారం కేబినెట్ లో యాక్షన్ టేకెన్ రిపోర్ట్ గురించే చర్చ ఉంటుందని తెలిపారు మంత్రి వివేక్. గత కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలు అమలు అవుతున్నాయో లేదో డిస్కషన్ ఉంటుందని అన్నారు. గిగ్ వర్కర్ల చట్టం గురించి ప్రిపరేషన్స్ నడుస్తున్నాయని.. గిగ్ వర్కర్స్ హక్కుల కోసం చర్యలు తీసుకుంటామని సీఎం సలహా మేరకు అసెంబ్లీలో పెట్టే అవకాశం ఉందని తెలిపారు.

సిగాచి 43 మంది చనిపోయిన ఘటనలో ఎంక్వైరీ చేయాల్సి ఉందని తెలిపారు. డిసెంబర్ లో ఇన్ స్పెక్టర్ రిపోర్టు ఇచ్చారు అందులో అన్నీ మెన్షన్ చేశారని చెప్పారు. కంపెనీ సూచనలు పాటించి ఉంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఉండేది కాదని తెలిపారు.మేనేజ్‌మెంట్స్, ఫెడరేషన్స్ తో25 న మీటింగ్ ఉందని భవిష్యత్తులో ప్రమాదం జరగకుండా ఉండేందుకు ఏంచేయాలో అక్కడ నిర్ణయం తీసుకుంటామన్నారు.

# సమ్మెతో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

## సింగరేణికి రూ.76 కోట్ల నష్టం!

**హైదరాబాద్, జూలై 10(జర్నలిస్ట్‌ఫైల్):** కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపు మేరకు సింగరేణిలో ఒక రోజు టోకెన్ సమ్మెలో కార్మికుల పాల్గొన్నారు. దీంతో బుధవారం సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడింది. ఫలితంగా సంస్థకు పెను భారంగా పరిణమించింది.ఒక్కరోజు సమ్మెతో 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. దాదాపు 76 కోట్ల రూపాయల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టంతో పాటు, సమ్మెలో పాల్గొనే కార్మికులకు కూడా వేతన రూపంలో కొంత నష్టం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విధంగా కార్మికులు దాదాపు 13 కోట్లు నష్టపోవాల్సి వస్తుందని అంచనా. ఎట్టి పరిస్థితుల్లో కార్మిక వర్గం సమ్మెలో పాల్గొనకుండా సహకరించి ఉత్పత్తికి అవాంతాలు కలుగకుండా చూడాలని సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి చేసినా వాటిని కార్మికులు ఖాతరు చేయలేదు. ఈ సమ్మెకు ముందునే కార్మిక సంఘాలన్నీ సింగరేణిలో సమావేశం నిర్వహించారు. ఒక్కరోజు సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలన్నీ గేట్ మీటింగ్ నిర్వహించాయి. విస్తృతంగా ప్రచారం చేశాయి. తొలుత మార్చి 20న సమ్మె చేయాలని అనుకున్నా భారత్, పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ సమ్మె వాయిదా పడింది. కాగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఐదు జాతీయ సంఘాల్లో నాలుగు సమ్మెకు మద్దతు తెలిపాయి. బీజేపీ అనుబంధ సంఘం మాత్రం సమ్మెకు దూరంగా ఉంది. విప్లవ కార్మిక సంఘాలు సైతం సింగరేణి సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కార్మికుల హక్కులు రక్షించుకోవాలంటే సమ్మెలో కచ్చితంగా పాల్గొనాలని కార్మిక సంఘాలు ముందుగానే నిర్ణయించి, ఈ సమ్మెను విజయవంతం చేశాయి.

# కల్తీకల్లు బాధితులకు మెరుగైన వైద్యం

## మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్,జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):** కూకట్‌పల్లి కల్తీకల్లు ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. బాధితులలో నిన్న ఒకరు మృతి చెందగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మరణించారు. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. నిమ్స్ డాక్టర్లతో ఫోన్ లో మాట్లాడి బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.బాధితులందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కాగా మంగళవారం కల్లు కాంపౌండ్ లో కల్లు తాగిన వారిలో 19 మంది అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే.

# విత్తనోత్పత్తితో నష్టపోయిన రైతులకు రూ.4 కోట్లు చెల్లింపు

## రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణలో విత్తనోత్పత్తి చేసి నష్టపోయిన 671మంది రైతులకు నష్టపరిహారం కింద 4కోట్ల రూపాయలు ఇప్పించడం జరిగిందని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో పర్యటించి రైతు సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని ములుగులో మొక్క జొన్న విత్తనోత్పత్తిలో జరిగిన మోసాలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. మల్టీనేషనల్ కంపెనీలు రైతులతో ఒప్పందం చేసుకొని విత్తనోత్పత్తి చేస్తున్నాయని తద్వారా పలువురు రైతులు నష్టపోయారన్నారు. దీంతో విత్తన కంపెనీల నుండి రైతులకు పరిహారం ఇప్పించామని చెప్పారు. ఇలా ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా లేదని తామే మొదటి సారిగా నష్టపరిహారం ఇప్పించామని వెల్లడించారు. కాగా ఏడాదిన్నర కాలంలోనే ప్రభుత్వం రూ.లక్ష 4వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రైతు కమిషన్ రైతులకు భరోసాగా పనిచేస్తోందని వివరించారు. తాము మళ్లీ ఆదర్శ రైతును ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. మోడీ సర్కార్ విత్తన చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అలాగే పంటల బీమా పథకం గుజరాత్ లో కూడా అమలు కావడం లేదని విమర్శించారు. యూరియాలో కేంద్రం తెలంగాణపై నిర్లక్ష్యం చూపిస్తోందని ఆరోపించారు.

# డ్రగ్ మహమ్మారిని నిర్మూలిద్దాం

## బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం



**విజయవాడ, జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):**

డ్రగ్ మహమ్మారిని నిర్మూలిద్దాం.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని సూపర్నెంట్ ఆఫ్ పోలీస్ ఓపియస్ అడ్మిన్ ఈగల్ ఎస్పీ, హెచ్.ఎఫ్. ఎ.సి. కమాండెంట్ 6వ బెటాలియన్ చీఫ్ కూచిపూడి నగేష్‌బాబు అన్నారు. ఫిలిం అండ్ టెలివిజన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మరియు శుభశ్రీ క్రియేషన్స్ వారిచే రూపొందించిన బెజవాడ చిల్లన్స్ రన్‌వే మరియు టాలెంట్ ఐకాన్ షో పోస్టర్‌ను బుధవారం ఫిలిం అండ్ టెలివిజన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చిన్నారులలో సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి షోలు ఎంతగానో దోహదపడతా యని పేర్కొంటూ ఈ సందర్భంగా నిర్వాహులను అభినందించారు. అనంతరం ఎఫ్‌టీపీసీ ఇండియా అధ్యక్షుడు చైతన్య జంగా, శుభశ్రీ క్రియేషన్స్ అధినేత ఇమ్మానియేల్ మాట్లాడుతూ, ఆగస్టు 2వ తేదీన బెంజిసర్కిల్‌లోని ట్రెండ్‌సెట్ మాల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలకు 5 నుండి 15 సంవత్సరాలు లోపు చిన్నారులకు ప్రవేశానికి ఈ క్రింది నంబరు నందు 89190 60267 సంప్రదించగలరని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలీవుడ్ నటీమణి మధుమితా గుప్తా, ఎస్పీ నగేష్‌బాబు, విజయ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజి అధినేత టి.అర్జున్‌రావు, అను హాస్పటల్ డైరెక్టర్ కె. (శ్రీదేవి తదితరులు హాజరవుతారని చెప్పారు. బాల్యం నుండే డ్రగ్స్‌ను అరికట్టాలనే థీమ్‌తో ఈ కార్యక్రమానికి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో విజయ స్కూల్ ఆఫ్ కాలేజీస్ అధినేత టి.అర్జున్‌రావు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికై జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి

## ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం



**విజయవాడ, జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):**

రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుండి పీజీ వరకు విద్యారంగ సమస్యల పరిష్కరించాలని జూలై 10వ తేదీన రేపు విజయవాడ ధర్నా చౌక్ నందు జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం( పి డి యస్ యు) రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు. మొగల్రాజపురంలోని పి డి యస్ యు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కె. భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయింది విద్యారంగ సమస్యలు అలాగే మిగిలి ఉన్నాయి. రాష్ట్రంలో పాఠశాల విలీన ప్రక్రియ వలన వేలాది పాఠశాలలో మూతపడుతున్నాయి రాష్ట్రవ్యాప్తంగా 6,400 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి. జీవో నెంబర్ 77వలన పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులు పీజీ విద్యకు దూరమవుతున్నారు. తల్లికి వందనం పథకాన్ని 2024- 25 విద్యా సంవత్సరంలో అమలు చేయకుండా ఈ విద్యా సంవత్సరంలో అనేక షరతలు విధించారు. దీనివలన లక్ష మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నారు. మెడికల్ కళాశాలలో ప్రైవేట్ పరం చేస్తా ఉన్నారు, మెడికల్ కళాశాల భూములు కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారు. మెడికల్ విద్య ప్రైవేటీకరణ చేసే జీవో నెంబర్ 108,109 రద్దు చేయాలి, సంక్షేమ హాస్టల్ లు సంక్షోభంలో ఉన్నాయి. నిత్యవసర వస్తువు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత ఏడాది కాలంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక సంక్షేమ హాస్టల్స్, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్తవ్యస్తకు గురవుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జూలై 10న రేపు విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఐ. రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ మహర్షి,ఎం. సునీల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అఖండ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలన తొలి అడుగుతో ప్రజలందరికీ మరింత సంక్షేమం

## 7వరోజు రోజు ఇంటింటికి ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు



**మైలవరం, జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):**

సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి ప్రచారంతో ప్రజలందరికీ మరింత సంక్షేమం చేకూర్తుందని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ అన్నారు. మంగళవారం తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు మైలవరం పట్టణంలోని 99,100 బూత్ లలో గడపగడపకు తిరుగుతూ ఏడాది పాలనలో రాష్ట్రం ప్రభుత్వం చేసిన, చేయబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధి కై ఎమ్మెల్యే వసంత చేస్తున్న కృషిని ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్‌డన్ లక్ష్మీశ.. కీప్ ఇట్ అప్

- రెడ్‌క్రాస్ సేవలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు గవర్నర్ ప్రశంసలు
- నిధుల సమీకరణ, సభ్యత్వ నమోదు, సామాజిక సేవలో కృషికి గుర్తింపు



**విజయవాడ, జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):**

ఎక్కడ విధులు నిర్వర్తించినా, ఏ హోదాలో ఉన్నా జనం నాడి పట్టి వారి బాగోగుల కోసం పరితపించే వ్యక్తిగా ఐఏఎస్ అధికారి డా. జి.లక్ష్మీశకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్‌గా, జిల్లా రెడ్‌క్రాస్ శాఖ అధ్యక్షులుగా సేవలందిస్తున్న ఆయనకు తాజాగా మరో పురస్కారం లభించింది. రెడ్‌క్రాస్‌కు నిధుల సమీకరణ, సభ్యత్వ నమోదులో విశేష ప్రతిభ కనబరచడమే కాకుండా.. సామాజిక సేవలో చేసిన కృషికి గుర్తింపుగా గౌరవ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ బుధవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన వార్షిక సమావేశంలో అవార్డు అందుకున్నారు. వెల్ డన్.. కీప్ ఇట్ అప్ అంటూ లక్ష్మీశను గవర్నర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పార్వతీపురం ఐటీడీఏ పీవోగా వినూత్నంగా ప్రెగ్నెంట్ ఉమెన్ హాస్టల్ ఏర్పాటుకు శ్రీకారంచుట్టింది మొదలు ఆపై ఎక్కడ పనిచేసినా విధి నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు సాధించారు లక్ష్మీశ. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఎన్‌టీఆర్ జిల్లాలోనూ రెడ్‌క్రాస్ ద్వారా పెద్దఎత్తున కార్యక్రమాలకు సారథ్యం వహిస్తున్నారు. నవ్య రాజధానికి గేట్‌వే అయిన విజయవాడలో ఎప్పటికప్పుడు భారీ కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ కార్యక్రమాల్లోనూ రెడ్‌క్రాస్ భాగమై వాటి విజయవంతంలో కీలకపాత్ర పోషిస్తోంది. రక్తదాన శిబిరాల ఏర్పాటు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై యువతను జాగృతం చేయడం.. ఇలా వివిధ కార్యక్రమాల్లో జిల్లా రెడ్‌క్రాస్ యూనిట్ ముందుం టోంది. పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడాలేని విధంగా ఆవిష్కరించిన వినూత్న పీ4 విధానం అమల్లోనూ రెడ్‌క్రాస్ ఓ గొప్ప అడుగుతో అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఏకంగా ఒక సచివాలయం పరిధిలోని మొత్తం 278 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా వ్యవహరించేందుకు తాజాగా ముందుకొచ్చింది.

### ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగింది

గౌరవ గవర్నర్ నుంచి అవార్డు స్వీకరించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని.. ఈ విజయం స్ఫూర్తితో రెడ్‌క్రాస్ ద్వారా సామాజిక సేవలో జిల్లాకు మరింత గుర్తింపు తెచ్చేందుకు కృషిచేస్తానని.. అదేవిధంగా స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనకు టీమ్ ఎన్‌టీఆర్‌తో కలిసి ముందుకు వెళ్తానని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, ఛైర్మన్ వైడీ రామారావు, వైస్ ఛైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, ట్రెజరర్ పి.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# పట్టిసీమ ద్వారా 13 లక్షల ఎకరాలకు సాగునీరు

- జల వనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- పవిత్ర సంగమం వద్ద పట్టీసీమ నీటికి జల హారతి



**ఇబ్రహీంపట్నం, జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):**

పట్టీసీమ ద్వారా ఈ సంవ త్సరం 13 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామ నాయుడు స్పష్టం చేశారు. బుధవారం ఇబ్రహీం పట్నం ఫెర్రీ ఘాట్ పవిత్ర సంగమం వద్ద కృష్ణమ్మలో కలిసిన పట్టిసీమ నుంచి విడుదల చేసిన గోదావరి జాలాలకు జలహారతి ఇచ్చి పసుపు, కుంకుమతోపాటు చీర, సారెలను విజయవాడ ఎంపీ కేశినేని శివ నాథ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీ రామ్ తాతయ్య, జిల్లా కలెక్టర్ లక్ష్మి శా లతో కలిసి సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో నదులు అనుసంధానం చేసిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడనీ పేర్కొన్నారు. కృష్ణ గోదావరి నదులను అనుసంధానం చేసిన విజనరీ లీడర్ సీఎం చంద్రబాబుడని, జగన్ పట్టిసీమను వట్టి సీమ చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నదులకు జలకల సంతరించేలా చర్యలు చేపట్టారనీ తెలిపారు. గోదావరి కృష్ణా నదులు అనుసంధానం వల్ల కృష్ణ డెల్టా దిగువ బాగాన ప్రజలు, రైతులకు అవసరమైన తాగునీరు కష్టాలు తీరాయన్నారు.రూ.1300 కోట్లతో పట్టిసీమ నిర్మిస్తే, 2014-19 లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణాడెల్టాకు తరలించడం ద్వారా రూ. 50వేల కోట్ల ఆదాయం వచ్చిందనీ తెలిపారు. 2014-19 లో 5 ఏళ్లలో 263 టీఎంసీ లకు పైగా గోదావరి జలాలు కృష్ణ డెల్టాకు తరలించాం. ఇది శ్రీశైలం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువనీ చెప్పారు. ఇప్పటి వరకు పట్టిసీమ ద్వారా 428 కు పైగా టీఎంసీ లను కృష్ణాకు తరలించామని, ఇది నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం కంటే ఎక్కువనీ చెప్పారు. నాడు టీడీపీ హయాంలో 1040 లిఫ్ట్ స్కీమ్స్ ద్వారా సాగు నీరందిస్తుంటే , వైసీపీ హయాంలో సరైన నిర్వహణ లేకపోవడం వల్ల 450 లిఫ్ట్ లు మరుగున పడ్డాయనీ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటర్ మేనేజ్మెట్ ద్వారా అన్ని రిజర్వాయర్లలో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయగలిగమని తెలిపారు. రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే, జగన్ పాలన వల్లే ఎక్కువ నష్టం జరిగిందనీ, ?వెంటిలేటర్ మీద ఉన్న ఆర్థిక వ్యవస్థ కు చంద్రబాబు , పవన్ కళ్యాణ్, మోదీ ల సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి ఊపిరి పోస్తున్నారనీ వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, విజయ్ బాబు, కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కొండపల్లి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి రావి ఫణి, కౌన్సిలర్లు వాసు, విజయలక్ష్మి, చనుమోలు నారాయణ, కాంతారావు, సైదులు, నాయకులు రామినేని రాజా, పెదర్ల రవి, గోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన
- ఏ ఒక్క కేసునూ నిర్లక్ష్యం చేయొద్దు
- యాంటీ లార్వాల్ ఆపరేషన్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టండి
- డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహించండి
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తప్పవు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జులై 10(జర్నలిస్ట్‌ఫైల్):**


వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. డెంగీ, మలేరియా, డయేరియా కేసులు నమోదు కాకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సీజనల్ వ్యాధులతో పాటు ఉపాధి హామీ పథకం అమలు, ఉద్యాన పంటల పెంపకం అంశాలపై కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్ నుంచి ఆర్‌డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎక్కడైనా వ్యాధి కేసు నమోదైతే పరిసర ప్రాంతాలలో ఇంటింటి సర్వే నిర్వహించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. క్రమంతప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఎక్కడా వర్షపునీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. యాంటీ లార్వాల్ ఆపరేషన్స్‌ను విస్తృత స్థాయిలో చేపట్టాలని ఆదేశిం చారు. జ్వరాల కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అందిస్తే అక్కడి నుంచి ఆయా ప్రాంతాల క్షేత్రస్థాయి బృందాలను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. సమన్వయం విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను ప్రాణంపెట్టి చేయాలని.. దీనివల్ల ప్రజలకు ఆరోగ్య భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. దోమల నియంత్రణతో పాటు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు, డిజిటల్ కంటెంట్, వీడియో షార్ట్ క్లిప్పింగ్స్ వంటివాటితో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజా భాగస్వామ్యంతో ప్రత్యేకంగా ర్యాలీలు వంటివి నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీటి వాటర్ సోర్స్‌లతో పాటు ఫిల్టర్ పాయింట్లను నిరంతరం తనిఖీ చేయాలని.. ఎక్కడా కలుషితమయ్యే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు చేపట్టాలని.. ఓవర్‌హెడ్ రిజర్వాయర్ల క్లీనింగ్, క్లోరినైజేషన్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా, సచివాలయ సిబ్బందితో అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

### 4 వేల ఎకరాల లక్ష్యంలో ఒక్క సెంటూ తగ్గడానికి వీల్లేదు

ఉపాధి హామీ పథకం ఆసరాతో ఉచితంగా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టేలా ప్రోత్సహించి రైతుకు మంచి ఆదాయం వచ్చేలా చేయాలని, దీనికి సంబంధించి నిర్దేశించిన 4 వేల ఎకరాల లక్ష్యంలో ఒక్క సెంటు కూడా తగ్గడానికి వీల్లేదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఆర్‌డీవోలు, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇప్పటికి దాదాపు 50 శాతం లక్ష్యాలను చేరుకున్నందున మిగిలిన లక్ష్యాన్ని యుద్ధప్రాతిపదికన చేరుకునేందుకు కృషిచేయాలని స్పష్టం చేశారు. సన్న చిన్నకారు రైతులను పేదరికం నుంచి బయటపడేసేందుకు ఇదో గొప్ప మార్గమని.. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి హామీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డ్వామా పీడీ ఎ.రాము, డీపీవో పి.లావణ్య కుమారి, ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్‌వో డా. జె.ఇందుమతి, జిల్లా మలేరియా అధికారి వి.మోతిబాబు, డా. ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కోఆర్డినేటర్ డా. జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్'!

## బ్రహ్మపుత్ర నదీజలాలపై భారీ డ్యామ్ నిర్మాణం



**ఇటానగర్,జూలై 10:** భారత్‌తో సరిహద్దులో ప్రపంచంలోనే అతిపెద్ద జల విద్యుత్ డ్యాంను చైనా నిర్మిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీన్ని చైనా వాటర్ బాంబ్‌గా ఉపయోగించే అవకాశం ఉందని అరుణాచల్‌ప్రదేశ్ సిఎం పెమా ఖండూ వ్యాఖ్యానించారు. చైనా మిలటరీ కంటే ఈ డ్యాంతోనే అతిపెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా వ్యూహాలకు దీటుగా భారత్ కూడా పలుచర్యలు తీసుకుంటోంది. భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలో ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ డ్యాంను చైనా నిర్మిస్తోంది. దీనికి యార్లుంగ్ త్సాంగ్పో ఆనకట్టగా పేరపెట్టింది. టిబెట్‌లో యార్లంగ్ సాంగ్పో నదిగా ప్రసిద్ధమైన బ్రహ్మపుత్ర నదిపై ఈ జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి 2024లో చైనా సర్కారు ఆమోదం తెలిపింది. 137 బిలియన్ డాలర్ల వ్యయంతో ఐదేళ్లలో దీన్ని నిర్మించాలని డ్రాగన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 60 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. బ్రహ్మపుత్రనది భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే ప్రదేశంలో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు సాయంతో చైనా బ్రహ్మపుత్ర నదిలో జలప్రవాహాన్ని నియంత్రించగలదు. భారీ మోతాదులో వరద నీటిని భారత భూభాగంపైకి వదిలి విధ్వంసం సృష్టించగలదు. అందుకే దీన్ని వాటర్ బాంబ్‌గా అరుణాచల్‌ప్రదేశ్ సిఎం పెమా ఖండూ అభివర్ణించారు.

చైనా మిలటరీ కంటే ఈ ఆనకట్టే భారత్‌కు అత్యంత ప్రమాదకరమని పెమాఖండూ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ జల ఒప్పందంపై చైనా సంతకం చేసి ఉంటే ఈ డ్యాం వల్ల భారత్‌కు పెద్దగా సమస్య వచ్చేదికాదని పెమా ఖండూ తెలిపారు. ఎందుకంటే ఆ ఒప్పందం ప్రకారం బ్రహ్మపుత్ర జలాలను కొంతమేర తప్పనిసరిగా కిందకు వదలాల్సి వస్తుందన్నారు. అంతర్జాతీయ జల ఒప్పందంపై చైనా సంతకం చేయనందున వేసవికాలంలో బ్రహ్మపుత్ర జలాలను భారత్‌లోకి రాకుండా చైనా మళ్లించే అవకాశం ఉందన్నారు. తద్వారా అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేస్తే దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. చైనా ఎప్పుడు ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. ఆనకట్ట నిర్మించి వారు అకస్మాత్తుగా నీటిని విడుదల చేస్తే, మన మొత్తం సియాంగ్ బెల్ట్ నాశనం అవుతుంది. ముఖ్యంగా ఆది తెగ సహా ఆ తరహా సమూహాలు అక్కడ ఎక్కువగా నివాసం ఉంటారు. ఆది తెగ ఆస్తి, భూమి, ముఖ్యంగా మానవ జీవితం వినాశకరమైన ప్రభావాలను ఎదుర్కొంటాయి. అసోంలో కూడా బ్రహ్మపుత్ర నది వరద వల్ల భారీ నష్టం సంభవిస్తుందన్నారు.

చైనా నిర్మిస్తున్న డ్యాం పూర్తైతే సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు ఎండిపోయే ప్రమాదం ఉందని పెమా ఖండూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకోసమే అరుణాచల్‌లో కూడా ఓ ప్రాజెక్టునునిర్మించనున్నాం. దానివల్ల మా నీటి అవసరాలను దానిద్వారా తీర్చుకునే అవకాశం ఉంటుంది. చైనా నిర్మిస్తున్న ప్రాజెక్టు భారత్‌చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. రక్షణ పరంగానూ భారత్‌కు దీనివల్ల సమస్యలు పొంచిఉన్నాయి. యుద్ధ పరిస్థితులు తలెత్తితే ఈ ప్రాజెక్టులో నిల్వచేసిన నీటిని చైనా వాటర్ బాంబ్‌గా ప్రయోగించే ప్రమాదం ఉంది.



## ఆర్థిక నేరస్తురాలు మోనికా కపూర్
# అమెరికాలో అరెస్టు

**న్యూఢిల్లీ, జూలై 10:** రెండుదశాబ్దాలుగా ఆర్థికనేరాల్లో నిందితురాలిగా ఉంటూ తప్పించుకుని అమెరికాలో తలదాచుకున్న ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారు మోనికా కపూర్‌ను ఎట్టకేలకు సిబిఐ భారత్‌కు రప్పించింది. దిగుమతి లైసెన్స్‌లను దుర్వినియోగంచేసి కోట్లాదిరూపాయలు మోసానికి పాల్పడిందన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ఆమె రెండుదశాబ్దాల క్రితమే అమెరికాలో ఆశ్రయం పొందుతున్నారు. ఆమెపై ప్రత్యేకించి మోనికా ఓవర్సీస్ సంస్థపేరిట 2.36 కోట్ల బంగారం దిగుమతుల్లో కూడా మోసం ఉందని సిబిఐ గుర్తించింది. 1998లో ఆమె తన సోదరులు రాజన్‌ఖన్నా, రాజీవ్‌ఖన్నాలతోకలిసి శిక్షార్హమైన నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు నమోదయ్యాయి. షిప్పింగ్ బిల్లులు ఫోర్జరీ చేయడం, ఇన్వాయిస్‌లు, బ్యాంక్ సర్టిఫికేట్లు, ఎగుమతుల్లో అవకతవకలు వంటివాటికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. బంగారం ఉచిత దిగుమతులకోసం ఆరు లైసెన్సులు తీసుకుని వాటిని దుర్వినియోగంచేసారని, వాస్తవానికి ఆ లైసెన్సులు జ్యూయెలరీ ఎగుమతులకు నిర్దేశించినవని సిబిఐ వాదించింది. ఎగుమతులకు బదులుగా అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న డీప్ ఎక్స్‌పోర్ట్స్‌కు విక్రయించినట్లు నేరం మోపారు. అంతేకాకుండా మోనికా సంస్థ దిగుమతులను ఎలాంటి సుంకాలు లేకుండా బంగారం దిగుమతులుచేసుకున్నదని, దీనివల్ల భారత ఖజానాకు 1.44 కోట్లనష్టం వాటిల్లినట్లు అభియోగాలు నమోదుచేసారు. ఆమె సోదరులను ఢిల్లీకోర్టు 2017లో ఒకకేసులో శిక్ష విధించింది. ఇక మోనికా కపూర్ అయితే విచారణ, దర్యాప్తు, కోర్టు విచారణను తప్పించుకుంటూ వస్తోంది. 1999లో ఆమె అమెరికాకు వెళ్లిపోయారు. 2002లో కేసునమోదుకాగా ఛార్జిషీటు 2004లో దాఖలుచేసారు. కాగా మోనికా కపూర్‌ను ఉద్దేశ్యపూర్వక ఎగవేత దారుగా 2006లో ప్రకటించారు. ఇందుకు సంబంధించి నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ కాగా ఇంటర్‌పోల్ రెండ్‌కార్నర్‌నోటీసు కూడా జారీచేసింది. 2010లో భారత ప్రభుత్వం ఆమెను తమకు అప్పగించాలని అమెరికాను అభ్యర్థించింది. అయితే ఈ అప్పగింత ప్రక్రియ న్యాయపరమైన సవాళ్లతో జాప్యం జరిగింది. కపూర్ తన అప్పగింతను సవాల్‌చేసింది.

తనను అక్కడ చిత్రహింసలకు గురిచేస్తారని, ఆమె వాదించింది. ఐక్య రాజ్య సమితిఒప్పందం ప్రకారం అమెరికా విదేశీ వ్యవహారాలు, సంస్కరణలు పునర్వ్యవస్థీకరణ చట్టానికి వ్యతిరేకంగా 1998లో ఆమె చేసిన క్లెయిమ్‌లన్నింటినీ తిప్పికొట్టారు. కాగా తాజాగా మోనికాకపూర్‌ను అమెరికాలో అదుపులోకి తీసు కుంది. అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎఎ 292లో కపూర్‌ను సిబిఐ అధికారులు భారత్‌కు తీసుకువచ్చారు. ఈ అప్పగింత ఒక మేజర్ రికార్డు అని ఉద్దేశ్యపూర్వక ఎగవేతత దారులు ఎక్కడ ఉన్నా ఎప్పటికైనా భారత్‌కు రావాల్సిందేనన్న వాదనను నిజంచేసిందని సిబిఐ అధికారులు చెపుతున్నారు.



## ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగు కన్నుమూత!

**భోపాల్, జూలై10** ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా పేరుపొందిన 'వత్సల' మహిళా ఏనుగు మంగళవారం తుదిశ్వాస విడిచింది. మధ్యప్రదేశ్‌లోని టైగర్ రిజర్వులో ఇది మృతిచెందింది. ఏనుగు ముందుకాళ్ల గోళ్లకు గాయాలు కావడంతో అభయారణ్యంలోని ఖైరైయాన్ కాలువసమీపంలో కూర్చుని ఉండిపోయింది. వైద్యులు, సిబ్బంది ఎంత ప్రయత్నించినప్పటికీ పైకి లేవలేకపోయింది. తర్వాత మృతిచెందినట్లుపన్నా టైగర్ రిజర్వు ప్రకటన విడుదలచేసింది. 100 ఏళ్లకుపైగా బతికిన ఈ ఆడ ఏనుగును దాదీమా, నానిమా అనే పేర్లతోపిలిచేవారు. వత్సల మృతితో వన్యప్రాణుల చరిత్రలో ఒక అధ్యాయం ముగిసిందని సీనియర్ అటవీ అధికారి ఒకరు తెలిపారు. అటవీ అధికారులు సిబ్బంది సమక్షంలో ఆ ఏనుగుకు అంత్యక్రియిలు నిర్వహించామని తెలిపారు వృద్ధాప్యం వల్ల వత్సలకు దృష్టిలోపం వచ్చింది. ఎక్కువదూరం నడవలేకపోయింది. హినౌటా ఎలిఫెంట్ క్యాంప్ నుంచి ప్రతిరోజు స్నానం చేయించడానికి తినడానికి దీన్ని ఖైరైయాన్ కాలువ వద్దకు తీసుకెళ్లేవారు. ప్రతిరోజూ వత్సలకు వైద్య నిపుణుల సమక్షంలో రీక్షలు నిర్వహించేవారు. పూర్తి సంరక్షణ వల్లనే వత్సల చాలా ఏళ్లు బతికిందని అధికారులు తెలిపారు. కేరళలోని నర్మదాపురంలో పుట్టిన ఈ ఏనుగును పన్నాకు తీసుకొచ్చారు. గత కొన్నేళ్లుగా పన్నా పులల సంరక్షణ కేంద్రంలో పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ వచ్చింది. వత్సల మృతిపై రాష్ట్ర సిఎం మోహన్ యాదవ్ విచారం వ్యక్తంచేసారు.

# బీహార్‌లోనూ ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారు..

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు!



**పాట్నా, జులై 10:** బీహార్‌లో ప్రతిపక్షాల ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. మహారాష్ట్ర తరహాలో నితీశ్‌కుమార్ పార్టీ తమకు అనుకూలమైన వారి ఓట్లు మాత్రమే జాబితాలో ఉండేలా మార్పులు చేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేపట్టిన బీహార్ బంద్‌లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభకు, మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో ముందుగా ఇండియా కూటమికి మెజారిటీ ఉన్నట్లు పలు సర్వేలు వెల్లడించాయని రాహుల్ పేర్కొన్నారు. కానీ అనుకోని విధంగా తాము ఆయా ఎన్నికల్లో ఓడిపోయామన్నారు.

అనంతరం ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎన్నికలకు వారం రోజుల ముందు దాదాపు కోటి మంది కొత్త ఓటర్లను చేర్చినట్లు గుర్తించామన్నారు. అలా కొత్త ఓటర్లను చేర్చిన అన్ని నియోజకవర్గాల్లో బిజెపి గెలుపొందిందని ఆరోపించారు. బీహార్‌లోను అదే కుట్ర వన్నుతున్నారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తాము ఓటర్ల జాబితా అడిగినప్పటికీ ఎన్నికల కమిషన్ అధికారులు ఇప్పటివరకు దానిని తమకు అందించలేదని రాహుల్ ఆరోపించారు. రాజ్యాంగ విలువలను రక్షించాల్సిన ఎన్నికల కమిషన్ తన బాధ్యతలు మరిచి బిజెపి సూచనల మేరకు పనిచేస్తోందని విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న బీహార్ బంద్‌పై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ ప్రభుత్వంలో ఎలాంటి తప్పులు చూపించడానికి అవకాశం లేకపోవడంతో కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌ను లక్ష్యంగా చేసుకున్నారని బిజెపి నేత షానవాజ్ హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ బంద్ ముసుగులో వారు చేస్తున్న గూండాయిజాన్ని రాష్ట్ర ప్రజలుస్వయంగా చూస్తున్నారన్నారు. భారత పౌరులు మాత్రమే రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయాలనే ఆలోచనతో మాత్రమే ఇసి ఓటర్ల జాబితాలను సవరిస్తుందన్నారు.

# చైనా, పాక్, బంగ్లాల మైత్రితో భారత్‌కు పొంచి ఉన్న పెనుముప్పు

## సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్



**న్యూఢిల్లీ, జూలై 10:** చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల కలయిక భారత్ సుస్థిరత, భద్రతకు తీవ్ర సవాళ్లను సృష్టించగలదని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని పలు దేశాల్లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని అదునుగా చేసుకొని, వాటిపై విదేశీ శక్తులు పట్టును పెంచుకునే ముప్పు ఉందన్నారు. దీనివల్ల కూడా భారత్‌కు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పారు. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూ దిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ సీడీఎస్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో పాక్ కొనుగోలు చేసిన ఆయుధాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం చైనావేనని ఆయన గుర్తు చేశారు. చైనా ఆయుధ తయారీ కంపెనీలతో పాకిస్థాన్ పెద్దఎత్తున ఒప్పందాలను కుదుర్చుకుందని అనిల్ చౌహాన్ తెలిపారు. ఆయా కంపెనీల ఆయుధ తయారీ యూనిట్లు, నిపుణులు పాక్ గడ్డపై కూడా కార్యకలాపాలు సాగిస్తుండొచ్చని అంచనా వేశారు. అణ్వస్త్ర దేశాలైన భారత్ పాక్‌లు మే 7 10 మధ్య తొలిసారిగా నేరుగా సైనిక శక్తులతో తలపడ్డాయన్నారు. నాలుగు రోజుల ఆపరేషన్ సిందూర్ వేళ చైనా సరిహద్దుల్లో ఎలాంటి అసాధారణ సైనిక చర్యలూ చోటుచేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. చైనా పాక్ మధ్య వ్యూహాత్మక స్నేహం ఉందని, ఆపరేషన్ సిందూర్ చాలా తక్కువ రోజులే కొనసాగడంతో చైనా వైపు నుంచి స్పందన రాలేదని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. అయినప్పటికీ ఆ రెండు దేశాల స్నేహాన్ని తప్పకుండా భారత్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాక్ అణ్వాయుధ బ్లాక్ మెయిలింగ్‌కు భయపడకుండా ఆపరేషన్ సిందూర్‌ను భారత్ నిర్వహించిందన్నారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య సైనిక ఘర్షణకు ఆపరేషన్ సిందూరే ఏకైక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత్ చేపట్టిన ఈ సైనిక చర్య చాలా ప్రత్యేకమైందని, దాని నుంచి ఆసియా దేశాలతో పాటు యావత్ ప్రపంచం పాఠాలను నేర్చుకోవచ్చన్నారు.

**ఇకపైనా సంప్రదాయక సైనిక ఘర్షణలే**

రాబోయే కాలంలోనూ సంప్రదాయక సైనిక ఘర్షణలే జరిగే అవకాశం ఉంది. అణ్వాయుధాల వినియోగం దాకా పరిస్థితులు తీవ్రతరం కావు. ఇందుకు మూడు ప్రాథమిక కారణాలు ఉన్నాయి. మొదటి కారణం ఏమిటంటే అణ్వాయుధాలను తొలుత ప్రయోగించకూడదనే భారత్ పాలసీ. అందుకే ఏ పరిస్థితుల్లోనైనా పాక్ కూడా భారత్‌తో సాధారణ తరహా (సంప్రదాయక) సైనిక ఘర్షణకే దిగుతుంది. రెండోకారణం ఏమిటంటే ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. దీనికి ప్రతిగా పాక్ సంప్రదాయక సైనిక ఘర్షణనే మొదలుపెట్టింది. మూడో కారణం ఏమిటంటే భారత్‌తో జరిగే సైనిక ఘర్షణలను ఏ స్థాయికి తీసుకెళ్లాలనేది పాక్ ఇష్టం. పాక్ స్పందించే రేంజ్ కంటే పెద్ద రేంజ్ లోనే భారత్ బలమైన సమాధానం ఇవ్వగలదు. ఈవిషయం పాక్‌కు బాగా తెలుసు. అందుకే అది సంప్రదాయక ఘర్షణకే పరిమితం అవుతుంది అని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

**బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూయిజ్ క్షిపణులతో పెద్దసవాల్**

సంప్రదాయక సైనిక ఘర్షణను పతాక స్థాయికి తీసుకెళ్లే సత్తా భారత్‌కు ఉందని సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. సైబర్, ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ మార్గాల్లోనూ దాడులు జరిపే సత్తా మన దేశానికి ఉందన్నారు. శత్రువులు ఈ తరహా దాడులు చేసినా ధీటుగా ఎదుర్కోగలమని ఆయన పేర్కొన్నారు. అయితే బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూయిజ్ రకాల క్షి పణులు, పెద్దసంఖ్యలో డ్రోన్లు, దిశను మార్చుకుంటూ ప్రయాణించే మిస్సైళ్లు, డ్రోన్ల నుంచి పూర్తిస్థాయి రక్షణను కల్పించే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఇంకా ప్రపంచంలో ఎక్కడా అందుబాటులోకి రాలేదన్నారు. రాబోయే కాలంలో ఈ తరహా సవాళ్లను ఎదుర్కొనేలా భారత్ సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ఏ క్షణమైనా శత్రుదేశాల దాడులను తిప్పికొట్టగల సైనిక సంసిద్ధత, 365 రోజుల్లో 24/7 అలర్ట్‌గా ఉండే వైఖరి అవసరమన్నారు.



# గురుత్వాకర్షణ లేని స్థితిలో మెంతి, పెసరసాగుపై అధ్యయనం

## భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా

**న్యూఢిల్లీ, జులై10 :** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ పరిశోధనలు చేస్తున్నారు. అందులో భాగంగా తాజాగా ఆయన ఐఎస్ఎస్‌లో రైతు అవతారం ఎత్తారు. రోదసిలో గురుత్వాకర్షణ లేని పరిస్థితుల్లో మెంతి, పెసర సాగుపై ఉండే ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా చిన్నపాటి గాజు పాత్రలో మెంతి, పెసర విత్తనాలను వేసి ఐఎస్ఎస్‌లోని నిల్వ ఫ్రీజర్ ఉంచి జీరో గ్రావిటీలో అవి ఏ విధంగా మొలకెత్తుతాయనే విషయాన్ని అధ్యయనం చేశారు. వాటికి సంబంధించిన ఫొటోలను తీశారు. ధార్వాడ్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్దపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తల సహాయంతో శుక్లా ఈ ప్రయోగాన్ని చేశారు. భూమిపైకి వచ్చాక ఆ మొలకలలో వచ్చిన జన్యుమార్పులు, పోషక విలువలను పరిశీలించినట్లు ఆక్సియం స్పేస్ వెల్లడించింది. మరో ప్రయోగంలో శుక్లా మైక్రో ఆల్గేలను అధ్యయనం చేశారు. వీటికి జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పరిశీలించారు. స్టెమ్ సెల్ పరిశోధన, విత్తనాలపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావాన్ని అధ్యయనం చేయడం, వ్యోమగాములు స్టేషన్‌లోని స్క్రీన్‌తో సంభాషించేటప్పుడు సమాచారాన్ని విశ్లేషించే వారి మానసిక సామర్థ్యం వంటి విషయాలను గమనిస్తున్నామని ఈ విషయాలు తనకు ఆనందాన్ని కలిగిస్తున్నాయని శుక్లా పేర్కొన్నారు. పరిశోధకులకు, స్పేస్‌స్టేషన్‌కు మధ్య వారధిగా ఉండి, వివిధ పరిశోధనలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.


యాగ్జియం -4 ప్రైవేట్ స్పేస్ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి గతవారం ఐఎస్ఎస్ చేరుకున్న సంగతి తెలిసిందే. అంతరిక్షంలోకి వెళ్లినప్పటి నుంచి శుక్లా అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణవ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను భారత విద్యార్థుల కోసం చిత్రించారు. ప్రయోగాల్లో భాగంగా వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం నిర్వహించింది.

# కర్ణాటకలో సిఎం మార్పు అనివార్యమా?

## అభివృద్ధి కోసమే ఢిల్లీకి వచ్చామంటున్న సిఎం, డిప్యూటీలు

**న్యూఢిల్లీ, జూలై 10:** కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి మార్పుపై జరుగుతున్న ప్రచారం ఇప్పుడు ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఇద్దరూ ఒకేసారి హస్తినలో పర్యటిస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు ఊపందుకున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు నాయకత్వ మార్పును కోరుతున్నారనే వార్తల నేపథ్యంలో, ఇద్దరు కీలక నేతలు కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశం కానున్నారనే ప్రచారం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. అయితే, ఈ పర్యటన పూర్తిగా రాష్ట్ర అభివృద్ధి పనులకు సంబంధించిందేనని అటు సిద్ధరామయ్య, ఇటు డికె శివకుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన డికె శివకుమార్, తాను రాష్ట్ర నీటి పారుదల ప్రాజెక్టులకు నిధుల గురించి చర్చించేందుకు వచ్చానని తెలిపారు. మంత్రివర్గంలో ఎలాంటి మార్పులు ఉండబోవని ఆయన తేల్చిచెప్పారు. "సీఎం సిద్ధరామయ్య రక్షణ మంత్రితో సమావేశం కోసం వచ్చారు. మా పర్యటనలన్నీ అభివృద్ధి కోసమే" అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని, ఆయన పాట్నా పర్యటన నుంచి తిరిగి రాగానే కలుస్తానని డికె వివరించారు. మరోవైపు, పార్టీ కర్ణాటక ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. దీనిపై డికె స్పందిస్తూ, జిల్లా స్థాయిలో పార్టీని పునర్వ్యవస్థీకరించాలని అధిష్టానం కోరుతోందని, దానిపైనే సుర్జేవాలా కసరత్తు చేస్తున్నారని చెప్పారు. 2023లో కాంగ్రెస్ ఘన విజయం సాధించినప్పటి నుంచి సీఎం పదవిపై చర్చ కొనసాగుతూనే ఉంది. అప్పట్లో కుదిరిందని చెబుతున్న ఒప్పందం ప్రకారమే మార్పు జరగనుందనే వాదనలు వినిపిస్తున్నా, కాంగ్రెస్ దీనిపై అధికారికంగా స్పందించలేదు.

# ఆస్ట్రేలియాపై భారతీయులకు పెరుగుతున్న క్రేజ్!



**మెల్‌బోర్న్, జూలై 10:** పర్యాటకం కోసం ఆస్ట్రేలియా వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సులభతరం చేసిన వీసా నిబంధనలు, పెరిగిన విమాన సర్వీసులు ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అందమైన ప్రకృతి, ప్రత్యేకమైన వన్యప్రాణులు, సిడ్నీ ఒపెరా హౌస్ వంటి అద్భుత కట్టడాలు ఉన్న ఆస్ట్రేలియా అంటే భారతీయులకు ఎప్పట నుంచో ఆసక్తి ఉన్నప్పటికీ, ఈ ఏడాది పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. టూరిజం ఆస్ట్రేలియా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మార్చితో ముగిసిన సంవత్సరంలో సుమారు 4.50లక్షల మంది భారతీయులు ఆస్ట్రేలియాను సందర్శించారు. ఇది గతేడాదితో పోలిస్తే 9.4 శాతం అధికమని టూరిజం ఆస్ట్రేలియా కంట్రీ మేనేజర్ (ఇండియా అండ్ గల్ఫ్) నిశాంత్ కాశికర్ తెలిపారు. పర్యాటకుల పెరుగుదలకు ప్రధాన కారణం సులభతరం చేసిన వీసా ప్రక్రియ అని ఆయన వివరించారు. అమెరికా, యూకే వంటి దేశాలతో పోలిస్తే ఆస్ట్రేలియా వీసా విధానం పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండటం, పాస్‌పోర్ట్‌ను భౌతికంగా సమర్పించాల్సిన అవసరం లేకపోవడం, బయోమెట్రిక్స్ లేదా ఇంటర్వ్యూలు వంటివి లేకపోవడంతో భారతీయులకు చాలా సౌకర్యంగా మారిందని పేర్కొన్నారు.

వీసాతో పాటు భారత్‌ఆస్ట్రేలియా మధ్య విమాన కనెక్టివిటీ కూడా భారీగా పెరిగింది. కరోనాకు ముందు వారానికి కేవలం 8 విమానాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 27కు చేరింది. అంతేకాకుండా అమెరికా డాలర్‌తో పోలిస్తే ఆస్ట్రేలియన్ డాలర్ మారకం రేటు స్థిరంగా (సుమారు రూ. 55.56) ఉండటం కూడా సానుకూల అంశమని కాశికర్ అన్నారు. సిడ్నీ, మెల్‌బోర్న్ వంటి నగరాలతో పాటు ఇప్పుడు టాస్మానియా, కంగారూ ఐలాండ్ వంటి కొత్త ప్రదేశాలను చూసేందుకు కూడా భారత పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారని ఆయన తెలిపారు.

# ఉత్తరకొరియా పౌరులను అప్పగించిన దక్షిణకొరియా

**సియోల్, జూలై 10:** తన ప్రత్యర్థి ఉత్తర కొరియాతో సంబంధాలను మెరుగుపరుచుకునేలా దక్షిణ కొరియా కీలకమైన చర్య చేపట్టింది. ఈ ఏడాది సముద్రంలో రక్షించిన ఆరుగురు ఉత్తర కొరియా పౌరులను సురక్షితంగా వారి స్వదేశానికి తిరిగి పంపినట్లు దక్షిణ కొరియా యూనిఫికేషన్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ పరిపాలనలో ఇరు దేశాల మధ్య సయోధ్యను పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలలో ఇది ఒక ముఖ్యమైన పరిణామంగా భావిస్తున్నారు.

ఈ ఏడాది మార్చి, మే నెలల్లో వేర్వేరు సమయాల్లో కొందరు ఉత్తర కొరియా పౌరుల పడవలు దారి తప్పి దక్షిణ కొరియా సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. వారిని దక్షిణ కొరియా అధికారులు రక్షించి అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వారు తమను స్వదేశానికి పంపాలని పదేపదే కోరుకుంటున్నారని, వారి పూర్తి అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ఉదయం ఇరు దేశాల మధ్య ఉన్న సముద్ర సరిహద్దు రేఖ దాటించి వారిని ఉత్తర కొరియా అధికారులకు అప్పగించినట్లు తెలిపింది. ఈ అప్పగింత ప్రక్రియ కోసం ఉత్తర కొరియాను సంప్రదించేందుకు సియోల్ చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పటికీ, చివరికి ఉత్తర కొరియా అధికారుల సహకారంతో ఇది విజయవంతంగా పూర్తయింది.

గత నెలలో కొరియాల మధ్య సంబంధాలను మెరుగుపరిచే చర్యలలో భాగంగా, సరిహద్దుల్లో ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ప్రచారం చేసే లౌడ్‌స్పీకర్లను దక్షిణ కొరియా సైన్యం ఆపివేసింది. ఈ చర్య ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని పునరుద్ధరించడానికి, కొరియా ద్వీపకల్పంలో శాంతిని పెంపొందించడానికి సహాయపడుతుందని అప్పట్లో రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. చర్చలను పూర్తిగా నిలిపివేయడం అవివేకమని, అమెరికాతో సమన్వయం చేసుకుంటూనే ఉత్తర కొరియాతో సంబంధాలు మెరుగుపరచుకోవాలని అధ్యక్షుడు లీజేమ్యుంగ్ గత వారం వ్యాఖ్యానించిన విషయం గమనార్హం. 195053 యుద్ధం కేవలం యుద్ధ విరమణతో ముగిసింది కానీ శాంతి ఒప్పందం జరగనందున, సాంకేతికంగా ఇరు దేశాలు ఇప్పటికీ యుద్ధ వాతావరణంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 150మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన నాయుడు శ్రీనివాసరావు (జాక్సన్) గురువారం సుమారు రూ. 30వేల విలువైన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, నీలం అంకారావు, కర్నాటి శివ సత్యనారాయణ, ఆకుల పానకాలరావు, ఫిరోజ్ ఖాన్, దానబోయిన శివశంకరరావు, సాలి నరేష్, యలమంచిలి పద్మజ, జనసేన నాయకులు లేళ్ల సాయి నందన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు



.గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వర్సిటీ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రత్యేక జన్మదిన కేకులు ఆయన కట్ చేశారు. అదే మాదిరిగా దూరవిద్య కేంద్రంలో కూడా సిబ్బంది ఏర్పాటుచేసిన ప్రత్యేక జన్మదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ సోషల్ సైన్స్ డీన్ ఆచార్య త్రిమూర్తి రావు మాట్లాడుతూ విద్యార్థి, పరిశోధకుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ... ప్రోత్సహిస్తూ... వారి అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. అందరితో స్నేహభావంతో ఉంటారని కొనియాడారు.
రాష్ట్ర ప్రభుత్వం నుండి బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతగా, యూజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ విధులు నిర్వహిస్తూనే, వర్సిటీ దూరవిద్య కేంద్రం అభివృద్ధిలో తనదైన ముద్రను వేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య రత్నాకర్, ఆచార్య ధనలక్ష్మి, అధ్యాపకులు, పరిశోధకులు, దూర విద్యా కేంద్రం సిబ్బంది, పలు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు

## సుపరిపాలనలో తొలి అడుగు



బ్రహ్మంగారిమఠం ( జర్నలిస్ట్ ఫైల్ ): ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారి ఆదేశాల మేరకు బి.మఠం మండల టిడిపి అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో సుపరిపాలనలా తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈరోజు లిబూత్ నెంబర్ 240లో బూత్ కన్వీనర్ తిప్పన రవితేజ నాయుడు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించడం జరిగినది ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు SR శ్రీనివాసులు బోల శ్రీను ధర్మ నాయుడు పూజ శివయ్య మేకల సుధాకర్ నాగయ్య సూరి మస్తాన్ టిడిపి నాయకులు పాల్గొన్నారు

## నారా లోకేష్ ఆలోచనలతో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

- మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :నారా లోకేష్ ఆలోచనలతో విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం అరండల్ పేట సెయింట్ ఇగ్నేషియస్ స్కూల్ లో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరియు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారు విద్యార్థులలో నైపుణ్యం పెంచడానికి, సృజనాత్మకత పెంచడానికి ఎనలేని కృషి చేస్తున్నారని, గతంలో పేరెంట్స్ మీటింగ్ ప్రైవేట్ పాఠశాలలో మాత్రమే జరిగేవి, వాటికి ధీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం ఇదే ప్రథమమన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి పరీక్షలు పూర్తి చేసిందని తెలిపారు. పేరెంట్ – టీచర్స్ సమావేశాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించటం ఒక చరిత్ర అని , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు డొక్కా సీతమ్మ గారి పేరు మీద మధ్యాహ్నం భోజనం పథకం ఏర్పాటు చేసిందని, సర్వేపల్లి రాధాకృష్ణ గారి పేరు మీద విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిందని, చదువుకున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద 13వేల రూపాయలు జమ చేశామన్నారు. గత వైసిపి ప్రభుత్వము నాసిరక దుస్తులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవల్లి, రావెల వెంకటయ్య, వకుళ దేవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో ఆక్రమణల తొలగింపు చర్యలు ప్రారంభం

- ప్రధాన రహదారులపై ఆక్రమణలు తొలగించకపోతే కఠిన చర్యలు
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన ఆక్రమణలను వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది స్వయంగా చర్యలు చేపడతారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం కెవిపి కాలనీ, జోసఫ్ నగర్, కావేరి కాలనీలలో ఆక్రమణలపై మౌలిక సదుపాయాలపై చేసిన తనిఖీలో ఆయా ప్రాంతాల్లో రోడ్లపై, డ్రైన్లపై ఏర్పడిన అడ్డంకులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వీధి వ్యాపారుల కోసం త్వరలో వెండింగ్ జోన్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రహదారులు, మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలు ట్రాఫిక్‌కు, పారిశుధ్య పనులకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయన్నారు. ఆక్రమణదారులు ప్రభుత్వానికి సహకరించి స్వచ్ఛందంగా అవి తొలగించుకోవాలని సూచించారు. అలాగే వెండింగ్ జోన్లలో వ్యాపారం చేసేందుకు వెండింగ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య శాఖ అధికారులకు తమ పరిధిలో ఉన్న ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జోసఫ్ నగర్ వాసులు ఆ ప్రాంతంలోని అనధికార నిర్మాణాలపై ఫిర్యాదు చేయడంతో కమిషనర్ స్వయంగా పరిశీలించారు. అటువంటి నిర్మాణాలకు అనుమతులు లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా తెలిపారు. ఇదిలా ఉండగా, రోడ్లపై చెత్త వేయకుండా నియమిత సమయాల్లో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ అధికారులతో కమిషనర్ సమీక్షించారు. అలాగే డ్రైన్లపై ర్యాంపులు నిర్మించి రోడ్లపైకి విస్తరించే నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డి.ఈ.ఈ వెంకట రమణ, ఏసిపి వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాచర్ల బుజ్జికి సేవా రత్న అవార్డు

- విజయవాడలో గురుపౌర్ణమి సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం



విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) : గురుపౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువులకు, కవులకు, సేవా తత్పరులకు ఘనంగా సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైద్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి సేవలకు గుర్తింపుగా “సేవ రత్న అవార్డు” అందుకున్నారు. విజయవాడ ఆశిష్ స్టూడియోలో జరిగిన ఈ కార్యక్రమంలో వేద మంత్రోచ్చారణల నడుమ, సంప్రదాయ బద్ధంగా గజమాలతో మాచర్ల బుజ్జిని సత్కరించారు. సేవా సంస్థ సీఈవో యూవీ రత్నం, బుజ్జి చేసిన సేవలను ప్రశంసిస్తూ ఆయనకు సేవ రత్న అవార్డును అందజేశారు. బుజ్జి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్య మిత్ర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన చొరవ, ఉద్యమాలపై ప్రశంసలు కురిసాయి. ఈ సన్మాన కార్యక్రమంలో డాక్టర్ ముండా వెంకట్రావు, కళాకారులు కోటయ్య, గద్దల రాజేష్, వెంకటేశ్వర్లు, రమణ తదితరులు పాల్గొన్నారు. సేవా తత్పరులను గుర్తించి సత్కరించడంలో తెలుగు కళారత్నాలు సంస్థ ముందుండటం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఉద్యమ శంఖారావం

- విజయవాడలో 13న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహణకు నిర్ణయం



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీ సంస్థ ప్రజలపై భారంగా విద్యుత్ ఛార్జీలు వేస్తున్నందుకు తీవ్రంగా స్పందించిన ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రతిఘటనోద్యమాన్ని ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం హనుమాన్ పేట దాసరి భవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రజాసంఘాల సమన్వయ సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 13వ తేదీన విజయవాడలోని దాసరి భవన్ సెమినార్ హాల్లో ఉదయం 10 గంటలకు రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి వామపక్ష పార్టీల నాయకులు, రైతు, కౌలురైతు, కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. గుడివాడ ఎన్టీఆర్ కాలనీలో స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వచ్చిన అదానీ సంస్థ సిబ్బందిని స్థానికులు అడ్డుకొని మీటర్‌ను పగులగొట్టిన ఘటనను నాయకులు ప్రశంసించారు. అనంతపురం జిల్లాలో రైతులు స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేసిన సంఘటనను సమావేశం అభినందించింది. స్మార్ట్ మీటర్ల వలన వినియోగదారులపై పెను భారాలు పడనున్నాయని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు వాడిన యూనిట్ల ఆధారంగా బిల్లులు వస్తుండగా, ఇకపై ముందుగానే రీఛార్జ్ చేసి ప్రీపెయిడ్ విధానంలో విద్యుత్ వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ఈ మీటర్ల ఖర్చు కూడా వినియోగదారుడే భరించాల్సి ఉండటం తీవ్ర అన్యాయమన్నారు. సింగిల్ ఫేస్ మీటర్‌కు తొమ్మిదివేల రూపాయలు, త్రీ ఫేస్‌కు పదెనిమిదివేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, ఈ మొత్తాన్ని నెలవారీ వాయిదాలలో వసూలు చేయనున్నారు. అధిక వినియోగ సమయంలో ఛార్జీలు పెరిగే అవకాశం ఉండటంతో ఇది విమాన టికెట్ల ధరల లాగా మారనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పంట పొలాల్లో, వాణిజ్య సముదాయాల్లో స్మార్ట్ మీటర్లు బిగించిన ప్రభుత్వం ఇప్పుడు గృహ వినియోగదారులపై దృష్టి సారించిందన్నారు. వినియోగదారుల అనుమతి లేకుండా బలవంతంగా మీటర్లు బిగించరాదని, ప్రజలు దీనికి వ్యతిరేకంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఇది విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు ముందడుగుగా భావిస్తూ ప్రభుత్వ విధానాలను నిలదీయాలని హెచ్చరించారు. ఈ ఉద్యమాన్ని ప్రతి వీధిలో, ప్రతి పేటలో విస్తరించాలని, గతంలో విద్యుత్ ఉద్యమం ఎలా జనవిగ్రహంగా మారిందో ఇప్పుడు కూడా ప్రజల ప్రతిఘటన ద్వారా ప్రభుత్వాన్ని వెనక్కినెప్పించాలని సమావేశం తీర్మానించింది. రైతు సంఘం నేత కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రాంపల్లి రవీంద్రనాథ్, సీఐటీయూ ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, ఇఫ్టూ అధ్యక్షులు ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ముని శంకర్, ఆంజనేయులు, మూర్తి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లి పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం విస్తృత తనిఖీలు

- చౌర్యానికి పాల్పడిన వినియోగదారులపై రూ.5.71 లక్షల అపరాధ రుసుములు



తాడేపల్లి ( జర్నలిస్ట్ ఫైల్ ) : తాడేపల్లి పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. విజిలెన్స్ పర్యవేక్షక ఇంజనీర్ ఓం శ్రీనివాసరావు నేతృత్వంలో, సీఆర్‌డీఏ సర్కిల్ ఆపరేషన్ విభాగం సమన్వయంతో ఈ తనిఖీలు జరిగాయి. కుంచనపల్లి సెక్షన్ పరిధిలోని చిర్రావూరు, గుండిమెడ, ఇప్పటం, కొలనుకొండ, కుంచనపల్లి, మల్లెంపుడి, ప్రాతూరు, తాడేపల్లి, వడ్డేశ్వరం తదితర ప్రాంతాల్లో 27 బృందాలుగా ఏర్పడి 27 మంది అధికారుల సహకారంతో మొత్తం 1642 విద్యుత్ సేవలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో మూడురకాల విద్యుత్ చౌర్యాలు గుర్తించారు. మీటర్లు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వినియోగించిన ముగ్గురిపై రూ. 60 వేల అపరాధ రుసుములు విధించగా, అనుమతించిన కేటగిరీకి భిన్నంగా విద్యుత్ వినియోగించిన 10 మందిపై రూ. 75 వేల జరిమానా వేశారు. అలాగే అనుమతించిన లోడుకు మించి విద్యుత్ వినియోగించిన 99 మందిపై రూ. 4.36 లక్షల అపరాధ రుసుములు విధించడంతో మొత్తం రూ. 5.71 లక్షల జరిమానా వసూలు చేశారు. ఈ విషయాన్ని విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చింతల వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. సంజీవరావు సంయుక్తంగా తెలిపారు. తనిఖీలు భారత విద్యుత్ చట్టం ప్రకారం జరిగాయని, వినియోగదారులు తమ ఇంట్లో ఉండే మీటర్లకు తప్పకుండా సీలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. తుప్పు పట్టి సీలు ఊడిపోయినా, కనిపించకపోయినా వెంటనే స్థానిక విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో మీటర్ల సీలు త్వరగా పాడయ్యే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీల్లో మీటర్ లేకుండా విద్యుత్ వినియోగించడం, పని చేయని మీటర్ బదులు మరో మీటర్ పెట్టి వినియోగించడం వంటి చర్యలు విద్యుత్ చౌర్యంగా పరిగణించబడతాయని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి సారి చేసిన తప్పుకు కాంపౌండింగ్ ద్వారా జరిమానా విధిస్తారు. రెండోసారి అయితే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతారు. అపరాధ రుసుము చెల్లించలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తులు జప్తు చేస్తారు. మొదటిసారి తప్పిదానికి మూడు రెట్లు, రెండోసారి ఆరు రెట్లు జరిమానా విధించే విధానం విద్యుత్ చట్టంలో ఉందని పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం ఒక సామాజిక నేరమని, దీనిపై సమాచారం ఇవ్వాలనుకునే వారు 9440812263, 9440812360, 9440812361 నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీలలో డివిజనల్ ఇంజనీర్‌లు కె. రవికుమార్, ఎన్. మల్లిఖార్జున ప్రసాద్, జి. సురేష్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్‌లు కోటేశ్వరరావు, సతీష్ కుమార్, శివశంకర్, ఆపరేషన్ విభాగానికి చెందిన శ్రీలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథం కార్యక్రమం ప్రారంభం



- చెత్త నుంచి సంపద సృష్టించాలి - జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే పిలుపు

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు రూరల్ మండలం లాల్పురం గ్రామంలో స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హేని క్రిస్టినా, స్థానిక శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతి బసు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే తడి, పొడి చెత్తను క్లాప్ మిత్ర ద్వారా వేర్వేరుగా సేకరించడం వల్ల ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని తెలిపారు. ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో చేపట్టిన వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజలు తమ వద్ద ఉన్న పాత వస్తువులను ఇచ్చి, ప్రత్యామ్నాయంగా నిత్యవసర వస్తువులను పొందే అవకాశాన్ని కల్పించిందన్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు, పాల ప్యాకెట్లు, ప్లాస్టిక్ కవర్లు, ప్యాకింగ్ ముడి పదార్థాలు, గాజు సీసాలు, పాత న్యూస్ పేపర్లు, పుస్తకాలు, అట్టలు, నూనె డబ్బాలు, పాత కంప్యూటర్లు, కీబోర్డులు, సీడీలు వంటి వృథా వస్తువులను స్వచ్ఛ రథం ద్వారా సేకరించి, వాటికి బదులుగా అవసరమైన వస్తువులు అందించనున్నట్లు వివరించారు. గ్రామ పరిశుభ్రతను కాపాడుకోవడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, స్వచ్ఛ రథం కార్యక్రమానికి గ్రామస్థులు సంపూర్ణ సహకారం అందించాలని చైర్‌పర్సన్ హేని క్రిస్టినా, శాసనసభ్యుడు రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. చెత్తను వదిలి, సంపదను ఆహ్వానించే దిశగా ఇది గొప్ప అవకాశం అని వారు పేర్కొన్నారు.

## మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



- విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం
- గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం గురువారం ఏటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు విద్యార్థుల భవిష్యత్తులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్రపై వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఒక విద్యార్థి పూర్తి వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయుల ప్రేరణతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను మెరుగైన విద్యా ప్రమాణాలతో అభివృద్ధి చేసే కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని వివరించారు. రుచికరమైన మధ్యాహ్న భోజనం, మౌలిక వసతుల కల్పన, పర్యావరణ అవగాహన కోసం ప్రతి విద్యార్థికి మొక్కల పంపిణీ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని విద్య వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఒక్కరిలోని ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత ప్రాముఖ్యమైందన్నారు. తానేనూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఐఏఎస్ హోదాలోకి వచ్చానని గుర్తుచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సామాజికంగా చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఏటుకూరు పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినందుకు వారికి, ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ, మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, ప్రధానోపాధ్యాయులు వై. వాణి, విద్యా కమిటీ చైర్మన్ రోజాకుమారి, స్థానిక పెద్దలు దాసరి వాసు, దేగల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటుకూరులో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ఉద్యోగుల హక్కుల కోసం నిరంతర పోరాటమే మాకు మార్గదర్శకం - యూనియన్

విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1952 జూలై 11న నిజాం ప్రభుత్వ పాలనలో రవాణారంగంలో ఉద్యోగుల హక్కుల కోసం ఈ సంఘం స్థాపించబడింది. అప్పటి నుంచి నిరంతరంగా ఉద్యోగుల హితానికి పనిచేస్తూ 73 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 74వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 129 డిపోలు, నాలుగు వర్క్‌షాపుల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. విజయవాడలో యూనియన్ రాష్ట్ర కార్యాలయమునందు ఉదయం పతాకావిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం విజయవాడ మెయిన్ డిపో వద్ద ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేసిన వేడుకలకు ఏపిజెఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. విజయవాడ డిపో ఇ.యు కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించబోతున్నట్లు యూనియన్ నేతలు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సత్యసాయి మహా సమాధిని దర్శించిన సీఎం చంద్రబాబు



- సత్యసాయి శతజయంతి ఉత్సవాలపై సమీక్ష
- మామిడి సహా ఇతర సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లిన సీఎం

**పుట్టపర్తి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి బాబా మహాసమాధిని ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శించుకున్నారు. కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ అనంతరం ప్రశాంతి నిలయానికి వెళ్లిన సీఎం చంద్రబాబు అక్కడే ఉన్న కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి మహా సమాధిని దర్శించుకున్నారు. బాబా మహాసమాధిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నవంబర్‌లో జరిగే సాయిబాబా శతజయంతి ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు రత్నాకర్‌తో పాటు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిశారు. రాష్ట్రంలో మామిడి, ఇతర పంటలకు సంబంధించిన సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రం తగు సాయం చేయాలని కోరారు.

## కరువు నివారణకు శాశ్వత పరిష్కారం కనుగొందాం



- కేంద్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శివరాజ్ సింగ్ చౌహాన్

**పుట్టపర్తి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** – రాయలసీమ జిల్లాల్లో కరువు నివారణకు శాశ్వత పరిష్కారం కనుగొందామని కేంద్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి పట్టణం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని కరువు పీడిత జిల్లాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, రాష్ట్ర హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ కమిషనర్ కే.శ్రీనివాసులు, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూలు జాయింట్ కలెక్టర్ నవ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలలో కరువును శాశ్వతంగా పరిష్కరించాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కలిసికట్టుగా కూర్చుని ఆలోచన చేయాలని, అలాగే కేంద్రంతో కూడా కరువు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ఆలోచించాలన్నారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉద్యాన శాఖ పరిధిలో పరిస్థితుల గురించి తెలియజేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, రాష్ట్ర హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ కమిషనర్ కే.శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలో కరువు పరిస్థితి, వివిధ పంటల సాగు వివరాలు, ఇరిగేషన్ అంశాల గురించి ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. బుందేల?ండ్ రీజియన్ మాదిరిగా రాయలసీమ జిల్లాలకు కూడా ఆర్థిక సహాయం ప్రకటించాలని, సీమ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రాయలసీమ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నిరీక్షణకు తగిన న్యాయం



**డిల్లీ ( జర్నలిస్ట్ ఫైల్ ) ::** ‘ఏపీలో చిన్న చిన్న వర్క్ లు చేసిన మెటీరియల్ సప్లయర్స్ కు శుభవార్త. 2014 – 19 సమయంలో జాతీయ ఉపాధి హామీ పనుల కింద రాష్ట్రంలో జరిగిన పలు వర్కులు నిమిత్తం రూ. 180 కోట్లను కేంద్ర ప్రభుత్వం నేడు విడుదల చేసింది. జరిగిన పనులను జరగలేదంటూ వైసీపీ గడిచిన ఐదేళ్లలో ఆ బిల్లులను తొక్కి పెట్టినప్పటికీ మెటీరియల్ సప్లయర్లకు కూటమి ప్రభుత్వం న్యాయం చేసింది. తక్ష సాధింపులు ఎల్లకాలం చల్లవని మరోసారి రుజువైంది.” అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. “2019లో నరేగా (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) కింద చిన్న స్థాయి మెటీరియల్ సప్లయర్స్ చేపట్టిన రూ.250–300 కోట్ల పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల విషయంలో ఎట్టకేలకు న్యాయం జరిగింది. అప్పటి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ పనులపై కక్ష సాధింపు ధోరణి అవలంబించి, వాటిని పూర్తిగా మూసివేసిన విషయం విదితమే. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ మార్పులతో పాటు, సప్లయర్ల బిల్లులు మొత్తం ఆపివేయడం జరిగింది. గత 6 సంవత్సరాలుగా వీరికి ఒక్క పైసా బిల్లులు కూడా చెల్లించలేదు.

కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తరువాత, కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య సమన్వయం జరిగి, పాత సాఫ్ట్‌వేర్‌ను తిరిగి అమలులోకి తీసుకురావడంతో పాటు, 4.3 లక్షల వర్కుల్లో 3.5 లక్షల వర్కులను తిరిగి ఓపెన్ చేయగలిగాం. మిగిలిన వర్కుల్లోని సాంకేతిక సమస్యలను పరిశీలించి పరిష్కరించడంపై చర్యలు కొనసాగుతున్నాయి.

ఈ ప్రక్రియ ద్వారా దాదాపు రూ.180 కోట్ల పెండింగ్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన Matching Funds కేటాయించి, వచ్చే 30 రోజుల్లోగా అన్ని బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించేలా Rural Development శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు మంత్రివర్గ స్థాయిలో జరిగిన సమీక్షలో నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రక్రియను పర్యవేక్షించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అందించిన సహకారం వల్లే ఇది సాధ్యమైందని గర్వంగా చెబుతున్నాను.” అని పెమ్మసాని గారు పేర్కొన్నారు.

# త్వరలో రెండో విడత ‘తల్లికి వందనం’ అమలు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- ఆర్థిక, ఆరోగ్య భద్రతతో కూడిన విద్యే ‘కూటమి’ లక్ష్యం
- క్రమశిక్షణతో కూడిన విద్యే ముఖ్యం



**పెనుకొండ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆర్థిక, ఆరోగ్య భద్రతతో కూడిన నాణ్యమైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చారన్నారు. త్వరలో రెండో విడత తల్లికి వందనం నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. మెగా పీటీఎం 2.0 సమావేశాన్ని పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆరోగ్యవంతమైన, జ్ఞానవంతమైన సమాజం కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దీనిలో భాగంగా మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చారన్నారు. విద్యార్థులకు సన్న బియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేశామన్నారు. త్వరలో రెండో విడత తల్లికి వందనం పథకం అమలు చేయబోతున్నామని, ఒకటో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో చేరిన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందనం నిధులు జమ చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,94,774 డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశామని, ఆ కిట్లలో రూ.2,500ల విలువ గల మూడు యూనిఫాం దుస్తులు, బూట్లు, బెల్ట్, పాఠ్య, నోటు పుస్తకాలు, డిక్షనరీ ఉన్నాయని మంత్రి సవిత తెలిపారు.

**రికార్డు స్థాయిలో మెగా పీటీఎం 2.0 నిర్వహణ**

రికార్డు స్థాయిలో 61 వేల ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో రెండు కోట్ల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మెగా పీటీఎం 2.0 నిర్వహిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బడుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా మెగా పీటీఎం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల ప్రగతి, అభ్యాసన సామర్థ్యాల పెంపుపైనా ఈ సమావేశంలో చర్చిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు, గురువులు, మహిళలు, తోటివారి పట్ల ఎలా మెలగాలో కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

**పిల్లలను డ్రగ్స్ కు దూరంగా ఉంచండి**

విద్య ఎంత ముఖ్యమో క్రమశిక్షణ అంతకంటే ప్రధానమని మంత్రి సవిత స్పష్టంచేశారు. ప్రస్తుతం డ్రగ్స్ విచ్చలవిడిగా లభ్యమవుతోందని, పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజూ రెండు మూడు గంటల పాటు తల్లిదండ్రులు తమ పిల్లలతో గడపాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని, అవసరమైన మేరకు మాత్రమే టెక్నాలజీ వాడుకోవాలని మంత్రి సవిత తెలిపారు.

**ప్రభుత్వ విద్యా సంస్థల్లో అత్యుత్తమ ఫలితాలు**

కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలు కారణంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో సత్ఫలితాలిస్తున్నాయన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో క్వాలిఫైడ్ టీచర్లతో బోధన చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలలు, ఎంజేపీ స్కూళ్లలో అడ్మిషన్లు పూర్తయ్యాయనే బోర్డులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థుల కంటే, గత మార్చిలో నిర్వహించిన టెన్త్, ఇంటర్ లో కూడా ఎంజేపీ, కస్తూర్బా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారన్నారు. ప్రభుత్వమందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాల, హాస్టల్ విద్యార్థులు విద్యలో ఉన్నతంగా రాణించాలని మంత్రి సవిత సూచించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి పేరుకు తీసుకురావాలన్నారు.

**విద్యార్థులకు గ్రీన్ పాస్ పోర్టులు**

విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ... ప్రతి విద్యార్థి చేత తమ తల్లి పేరు మీద మొక్క నాటిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందుకోసం విద్యార్థులు గ్రీన్ పాస్ పోర్టులు అందజేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి తాము నాటిన మొక్కను మూడేళ్ల పాటు సంరక్షించాల్సి ఉంటుందన్నారు. పెళ్లి రోజు, పుట్టిన రోజు... ఇలా ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మొక్కలు నాటే అలవాటు అందరూ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇతర పాఠశాల అధ్యాపక సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టెక్కలిలో తల్లిదండ్రులు - విద్యార్థుల ఆత్మీయ సమావేశం



**టెక్కలి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తల్లిదండ్రులు – విద్యార్థుల ఆత్మీయ సమావేశం (పిటివైటిఎం – 2.0) కార్యక్రమాన్ని టెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరి రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ సహకారంతో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందించి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. టెక్కలి నియోజకవర్గ శాసనసభ్యుడు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం లోక్‌సభ సభ్యుడు, కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో పాఠశాలను అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. విద్యార్థులు తల వంచి నేర్చుకుంటే, ఆ చదువే వారికి భవిష్యత్‌లో తలెత్తి నిలిచే స్థానం కలిగిస్తుందని ఆకాంక్షించారు. చక్కగా చదివి, ఉన్నత స్థానాలకు చేరాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోళ్ల లవకుమార్, మట్ట పురుషోత్తం, మామిడి రాము, బసవల అప్పలస్వామి, మెండ దమయంతి, దల్లి ప్రసాద్ రెడ్డి, ప్రఫుల్ల పరిడ, ధోని బుజ్జి, సోదిమిడి కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ చైర్మన్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో ప్రజలు, కార్యకర్తలను కలిసిన మంత్రి నారా లోకేష్



- పలు సమస్యలపై వారి నుంచి అర్జీలు స్వీకరణ
- మంత్రి లోకేష్ ను కలిసి వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు
- సమస్య పరిష్కారానికి మంత్రి లోకేష్ హామీ

**పుట్టపర్తి( జర్నలిస్ట్ ఫైల్ ) :** శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం–2.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు పుట్టపర్తి చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముందుగా.. గురువారం ఉదయం కప్పలబండలోని పారిశ్రామిక వాడలో ప్రజలు, కార్యకర్తలను కలుసుకున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి.. వివిధ సమస్యలపై వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రతి ఒక్కరితో కలిసి ఫోటోలు దిగారు.

**మంత్రి లోకేష్ ను కలిసి వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు**

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కడపలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్టర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి యూనివర్సిటీ గుర్తింపు విషయంలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. విద్యార్థుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్.. కలిసికట్టుగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనా చెందవద్దని భరోసా ఇచ్చారు. విద్యార్థులు విద్యపై దృష్టిపెట్టాలని, మీ భవిష్యత్ ను తాను చూసుకుంటాని ధైర్యం చెప్పారు.

విశ్వవిద్యాలయాలు రాజకీయాలకు దూరంగా ఉండాలని, ఈ దిశగా యూనివర్సిటీలను ప్రక్షాళన చేస్తామని ఈ సందర్భంగా చెప్పారు.

## పాలనలో పారదర్శకత కూటమి ప్రభుత్వవిధానం

- మంత్రి నాదెండ్లమనోహర్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతానికి భిన్నంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసామని సకాలంలో వారి ఖాతాల్లో నగదు జమ చేసామని, ఆ ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక కూటమి పార్టీల కార్యాలయంలో గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, నెలరోజులకే రైతుబకాయిలు వెయ్యి కోట్ల రూపాయలు చెల్లించిందని ఆ తర్వాత 674 కోట్లు బకాయిలు చెల్లించామని అన్నారు. ఈ ఖరీఫ్ లో,రైతుల వద్ద నుండి 8282 కోట్ల రూపాయల మేర ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం విక్రయించిన ప్రతి రైతు ఖాతాలో నగదు జమ చేయడం ద్వారా,

5 లక్షల 66,682 మంది రైతులకు న్యాయం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో,పెద్ద రైతులు దళారులు సిండికేట్ గా మారి,చిన్న సన్నకారు రైతులను ఇబ్బంది పెట్టారని, కూటమి ప్రభుత్వంలో అటువంటి లోపాలు లేకుండా పారదర్శకతతో ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పైశాచిక ఆనందానికి, తన పర్యటనలో, గతంలో మనుషులను తొక్కించారని, తాజాగా రైతుల పంటలు తొక్కిస్తున్నారని ఈ విధానం సరికాదన్నారు. వ్యక్తిగత విమర్శలు పోలీసులపై దాడులు మానుకోవాలన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారి పట్ల కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. సమాజంలో అలజడి సృష్టించి లా అండ్ ఆర్డర్ సమస్య తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. పార్టీ అధినేతగా ఉండే వ్యక్తి ఇలా వ్యవహరించడం మంచిది కాదన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ దుష్ప్రచారం మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల దగ్గర చిల్లర రాజకీయాలు చేయదని చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని అన్నారు. జగన్

## డిఎంఇ ఆసుపత్రుల్లో 77 డాక్టర్ల పోస్టుల భర్తీకి ఈ నెల 17న వాక్-ఇన్ రిక్రూట్మెంట్

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ)కు చెందిన ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనుంది. మొత్తం 77 పోస్టులకు ఈ నెల 17న వాక్–ఇన్ రిక్రూట్మెంట్ నిర్వహించనున్నారు. విజయవాడ హనుమాన్‌పేటలోని ఓల్డ్ జిజిహెచ్ క్యాంపస్‌లో ఉన్న డిఎంఇ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ రిక్రూట్మెంట్ నిర్వహించనున్నారు. ఇందులో 40 ప్రొఫెసర్లు, 37 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయనున్నారు. వివరాలకు సంబంధించి అధికారిక వెబ్‌సైట్లు http://apmsrb.ap.gov.in/msrb/ లేదా https://dme.ap.nic.in లో సందర్శించవచ్చు. ఇదే సమయంలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 15 ఎపిడెమాలజిస్ట్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 10 నుండి 16వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను అభ్యర్థులు చూడాలని సూచించారు.

## రాష్ట్రంలో ఎక్కడా అంటువ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ గా వచ్చే వివిధ అంటువ్యాధుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర పి–4 ఫౌండేషన్,సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు, వివిధ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలక్టర్లు,సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ వర్షాకాలంలో వాటర్ బోర్న్,వెక్టర్ బోర్న్ సంబంధిత వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా డెంగ్యూ,మలేరియా,చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రభలకుండా ఎప్పటికప్పుడు డిఎంఅండ్ హెచ్ఓ,సుపరింటిండెంట్లతో సమావేశం జరిపి రోజు వారీ పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని తాగునీటి పైపులైన్లన్నీ లీకేజిలు లేకుండా సక్రమంగా ఉండేలా చూడాలని సిఎస్ విజయానంద్ చెప్పారు.

స్వర్ణాంధ్ర పి–4 కార్యక్రమంపై సిఎస్ మాట్లాడుతూ ఆగష్టు 15 నాటికి రాష్ట్రంలోని 15 లక్షల బంగారు కుటుంబాలు(పేద కుటుంబాలను)మార్గదర్శులు దత్తత తీసుకోవాలని ప్రభుత్వం లక్ష్యం గా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబాన్ని పేదరికం నుండి బయటికి తెచ్చేందుకు మార్గదర్శులు ద్వారా వారికి తగిన తోడ్పాటును అందించాల్సి ఉందని ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో పరిశుభ్రతను మెరుగు పర్చడంతో పాటు పూర్తి స్థాయిలో మరుగు దొడ్లు అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. ముఖ్యంగా నిర్దేశిత మెనూప్రకారం ఆరోగ్య కరమైన ఆహారాన్ని విద్యార్థులుకు అందించేందుకు కృషి చేయాలని కలక్టర్లకు సిఎస్ స్పష్టం చేశారు.

ఈసమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యంటి.కృష్ణబాబు మాట్లాడుతూ వర్షాకాలం పూర్తయ్యే వరకూ అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలక్టర్లకు స్పష్టం చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు. డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధుల కేసులు గత ఏడాదితో పోలిస్తే తక్కువగా నమోదు అయ్యాయని తెలిపారు. గత ఏడాది మొదటి ఆరు మాసాల్లో 2696 మలేరియా కేసులు నమోదైతే ఈఏడాది మొదటి ఆరు మాసాల్లో 4536 కేసులు నమోదు అయ్యాయని కావున మలేరియా వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. మలేరియా ప్రభావిత ప్రాంతాలకు త్వరలో మెడికేటెడ్ దోమ తెరలను అందించేందుకు కృషి జరుగుతోందని ఆయన వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనను పూర్తిగా నియంత్రించాలని,డ్రైన్ల వెంబడి ఉండే మంచినీటి పైపులైన్ల లీకేజిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులు,కలక్టర్లకు సూచించారు. అదే విధంగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని మరింత ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలని కృష్ణబాబు స్పష్టం చేశారు. అంతకు ముందు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ స్వర్ణాంధ్ర పి–4 కార్యక్రమం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై కలక్టర్లకు వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈసమావేశంలో సాంఘిక,గిరిజన సంక్షేమశాఖల కార్యదర్శి ఎంఎం నాయక్,ఎపి ట్రాన్స్ కో జెఎండి కీర్తి,ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్,ప్రణాళికా శాఖ జెఎస్ అనంత శంకర్ పాల్గొన్నారు. అలాగే వర్చువల్ గా ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల ఇతర అధికారులు,జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467